# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 30 Issue 5

No.of Pages 40

JANUARY 2011

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో....** **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీ అభిభాషణ | 8 |
| సన్నిధిలో సంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 14 |
| శ్రీమాతాజీవారి నవరాత్రి సందేశాలు | 15 |
| శ్రీకృష్ణతత్వము, ప్రేమయోగము | 17 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 20 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 22 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 25 |
| సమర్థసద్గురు నాధుని దివ్యచరిత్ర | 27 |
| అమెరికాలో శ్రీ మాతాజీ | 29 |
| జగన్మాతని దర్శింప శక్యమా! | 31 |
| మన సాధన ఎందుకు ఫలించటంలేదు? | 33 |
| తిరునీలకంఠ నాయనార్ | 35 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**సర్వద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ ।**
**మూర్ధ్నాధా యాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్ ॥**
**ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్ ।**
**యఃప్రయాతి త్యజన్దేహం సయాతి పరమాం గతిమ్ ॥**

అంత్యకాలములో భగవన్నామ స్మరణ చేసినవారికి మోక్షము తథ్యము. కాని అంత్యకాలము ఎప్పుడు? ఎవరు చెప్పగలరు? శ్రీబాబూజీ మహరాజ్, 'సాధన ఎంతవరకు చేయా'లనే ప్రశ్న వేసి, దానికి ఎవరూ సంతృప్తికరమైన సమాధానం చెప్పని కారణంగా ఉద్బోధిస్తూ .......

"సాధకుడు ముందుగా నిత్యానిత్య వస్తు వివేకం కలిగినదా, అని ప్రశ్నించుకోవాలి. పోనీ భగవంతుని సేవా కార్యక్రమం నిమిత్తం దేహసంబంధమైన ఏ పనైనా త్యాగం చేయగలుగుతావా? నీలో ద్వైత దృష్టి నశించినదా! రాగద్వేషాలు, సుఖదుఃఖాలు దాటగల్గావా? మనస్సు స్థితి ఎలా ఉంది? తితీక్ష పొందినదా? ఏవిధమైన భగవత్ కార్యమందైనా మనస్సు ఆసక్తి కనపరుస్తోందా", అని బోధించి, "పైన చెప్పినవాటిలో ఏ ఒక్కటి సాధించినా సాధన చేయవలసిన అవసరం లేదు".

"మనస్సు వేరొక వస్తువుని వాంచిస్తే కదా! మనస్సు నిరంతరము కర్మణా, వాచా, భగవంతుని యందు లగ్నమైన సాధకునికి అంత్యకాలం ఎప్పుడైతే ఏమిటి? ఆ స్థితిని సాధించటానికి శ్రీకృష్ణపరమాత్ముడు **వ్యాహరన్** అని ఊరుకోకుండా **మామనుస్మరణ్** అంటే అనుక్షణము చింతనము చేయమని హెచ్చరించారు. దేహభావన మరచి సద్గురు మూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమును మరువక నిరంతర స్మరణలో ఉన్న సాధకుడు మోక్షస్థితిలోనే ఉన్నాడు. దేహం ఎప్పటికైనా రాలిపోయేదే. ఇంక అంత్యకాలము ఎప్పుడు అన్న ప్రశ్న ఉదయించదు కదా", అన్నారు శ్రీబాబు.

'పూజించు, భజించు, స్మరించు, ధ్యానించు, తరించు'అని శ్రీమాతాజీ వారు చేసిన హెచ్చరిక అనుక్షణము, ప్రతిక్షణము భగవత్ చింతనలో ఉండమనే కదా! అటువంటి సాధకునికి అంత్యకాలం ఎప్పుడైతే ఏమిటి? After all అనేది మాటలో కాదు, మనస్సులో దృఢ భావన అయి ఉండాలి. *

# అమ్మ ఆశీస్సులు

**'ఓం నమః శివాయ'** అంటే **'ఓయ్',** అంటాడు ఈశ్వరుడు. మనతో ఆడుకుంటూ, ఆడిస్తూ సర్వసాక్షి అయిన పరశివ స్వరూపుని కార్తీకమాసం జరిగింది. **'మాసానాం మార్గశీర్షో z హం'** అని శ్రీగీతాచార్యుని సందేశం కదా! మార్గశీర్షమాసంలో అడుగుపెట్టాము.

**శివాయ విష్ణురూపాయ, శివరూపాయ విష్ణవే । శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్‌ం శివః ॥**

శివుడు అంటే విష్ణువే. విష్ణువు అంటే శివుడే. శివుని హృదయము నందు విష్ణువు, విష్ణువు హృదయమందు శివుడు ప్రకాశిస్తున్నారు. వీరి మధ్య భేదమే లేదు అని ఉపనిషత్తులు, వేదములు మనకి తెలియజేస్తున్నవి. వారిలో భేదము, భిన్నత్వము లేదు. మనకు, పరమాత్మకు కూడా భేదము లేదన్న విషయము శ్రీసద్గురుదేవుల బోధ, శ్రవణము ద్వారా గుర్తించిన వారికి భిన్నత్వము లేనేలేదు.

అదే 'సారతత్త్వోపదేశము'నందు శ్రీ ఆది శంకరాచార్యులు అన్నారు.........

**అద్వైతం త్రిషులోకేషు । నాz ద్వైతం గురుసన్నిధౌ ।**
**భావాz ద్వైతం సదా కుర్యాత్ । క్రియాz ద్వైతం న కర్హిచిత్ ॥**

భావములో ఎల్లప్పుడూ అద్వైతమునే అనుభవించవలెను. ఏ ఒకానొకప్పుడైనా క్రియలో మాత్రం అద్వైతం పనికిరాదు. మూడులోకము లందు అద్వైతమే ఉండవచ్చు. కాని గురుసన్నిధిలో మాత్రం ప్రభువు, సేవకుడు, గురువు, శిష్యుడు ద్వైతమే కాని అద్వైతం ఉండకూడదు.

శ్రీగురుదేవులను ఆశ్రయించిన సద్భక్తునికి, సచ్ఛిష్యునకు అట్టి శ్రీసద్గురుదేవులను సేవించుటలోనూ, శ్రీసద్గురు పదములను ఆశ్రయించుట లోనూ బోధను శ్రవణము చేయుటలోనూ ఎంతో సహజమైన తృప్తి, ఆనందము ఉంటుంది. తద్వారా భావన సద్భావనగా మార్పు చెంది 'ఉన్నది' అంటే శ్రీగురు దైవత్వమే అన్నది ఆరూఢమవుతుంది. అట్టి హరిహర స్వరూపుడైన శ్రీసద్గురుదేవుల ఆశీస్సులు మనపై వర్షించుగాక! అఖండ భక్తిజ్ఞాన వైరాగ్యములను ప్రసాదించి సర్వదా శ్రీగురుపాదుకలు రక్షించుగాక!!

- మీ అమ్మ

# సంపాదకీయం

భక్తమహాశయులంతా ఈ సంచికను అందుకునేసరికి నూతన సంవత్సరంలో ప్రవేశిస్తాము. శ్రీసద్గురుదేవుల దివ్య ఆశీస్సులు మనందరిపై వర్షించుగాక!

'ఏనాడేమో భగవత్పాదాబ్జములెంతేని పట్టుకొన్నారమో! ఆనాడే చరితార్థ జన్మలమైనా' మని కవిగారు సెలవిచ్చినట్లుగా మనమంతా ఆనాటి నుండి నిత్యనూతన జీవితంలో ప్రవేశించాము. కాలం ఆగదు. కాలగమనంతోపాటు జగత్తులో పరిణామము తప్పదు. కాని మనమంతా మార్పుచెందని వస్తువుని పట్టుకొన్నాము. కాబట్టి నూతన సంవత్సరములో సుఖశాంతులతో వర్థిల్లతామనటానికి సందేహమెందుకు?

ఆశ్రమంలో చూతవృక్ష ఛాయలో ధనుర్మాస కార్యక్రమాలు ప్రారంభం అయి యధావిధిగా నడుస్తున్నాయి.

ఇటీవల కొలదిరోజులుగా వాతావరణ పరిస్థితులు సరిగా లేక అకాల వర్షాల కారణంగా ముఖ్యంగా రైతులు నష్టపోయారు. వారందరికి భక్తులందరి తరపున సానుభూతి తెలియజేసుకుంటూ, సంక్రాంతి సందర్భంగా శ్రీబాబూజీ మహరాజ్‌వారికి భోగిపళ్ళు పోసే కార్యక్రమానికి అందరూ ఆశ్రమానికి విచ్చేసి, శ్రీమాతాజీవారు తమ స్వహస్తాలతో అందరికి ప్రసాదించే భోగిపళ్ళు తీసుకుని ఆయురారోగ్య ఐశ్వర్యవంతులయ్యేదరు గాక, అని సద్గురు మూర్తిని ప్రార్థిస్తూ..........

పరాశర ప్రసాద్

(గౌరవ సంపాదకుడు)

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్



ఆ పరాశక్తిని నమ్మి చెడినవారు లేరు. ఆమె అనంత శక్తి స్వరూపిణి, ఆత్మ స్వరూపిణి. ఇది బాబు మాట కాదు. వేద సమ్మతము; ఉపనిషత్తులు, అన్ని పురాణాలు, ఇదేమాట చెబుతున్నవి. ఆ అనంతశక్తి కరుణయే లేకపోతే మానవుడు చెయ్యి కూడా ఎత్తలేడు, మాట్లాడలేడు, చూడలేడు, ఏ పనీ చేయలేడు. మానవునికి దశ యెత్తుకున్నపుడు ఎదురుండదు. ఆ దశ తొలగిన తరువాత అతని యాతనకు అంతు ఉండదు. ఎంత విద్య, తెలివి తేటలు ఉన్నా ఉపయోగపడవు. నిర్ణయ కాలంలో నిర్ణయించి ఉన్న విధిని ఎవరూ తప్పించుకోలేరు. జ్ఞాని యీ సత్యాన్ని గ్రహించి దుఃఖపడక, ఆగామి, సంచితములను గూర్చి చింతించక, ప్రారబ్ధమును దేహంతో అనుభవిస్తూనే, మనో, బుద్ధులను భగవద్ధ్యానములో నిలిపి జన్మ రాహిత్యాన్ని పొందుతాడు. అజ్ఞాని దీనిని అర్థం చేసుకోలేక అశాంతికి గురి అవుతాడు.

ఈ కనపడే సృష్టి అంతా పరిణామంతో కూడినది, వృద్ధి క్షయములతో కూడినది, అది అంతము కలిగినది. కాని అనంతశక్తి అయిన ఆత్మశక్తి పరిణామ రహితమైనది, వృద్ధిక్షయములు లేనిది, శాశ్వతమైనది. ఇప్పుడు నేను మాట్లాడుతున్న యీ మైకు 575 రూపాయలు పెట్టి తెచ్చారు. బాబుగారు దీనిలో మాట్లాడితే మనమందరము బాగా వినవచ్చును అని వాళ్ళ ఆశ, అయితే దీని శక్తికి పరిమితి ఉంది. కరెంటు అందకపోతే దాని పని గోవిందా.

ఈ మానవ శరీరము, దానితో అనుభవించే యీ ప్రాపంచిక సుఖాలు అన్నీ మనకు దుఃఖాన్నే తెచ్చి పెడతాయి. అవన్నీ మారిపోయేవి. కాని మారిపోయే యీ శరీరంలో మారనిది, పుట్టి నశించే యీ శరీరంలో చావు పుట్టుకలు లేని శాశ్వతమైనది ఒకటి ఉంది. దాని వల్లనే యీ శరీరం ప్రకాశిస్తోంది. పని చేస్తోంది. నల్లని వెంట్రుకలో నలుపు మోసము. అది

మారిపోయేది. అందులో తెలుపు దాగి ఉంది. అది మారని సత్యము. నల్లని వెంట్రుక తెల్లబడుతుంది గాని, తెల్లబడిన వెంట్రుక ఇక మళ్ళీ ఎప్పటికీ నల్లబడదు. దానికి నల్లరంగు పూసినా, మళ్ళీ అడుగు నుంచి తెలుపు బయటికి రానే వస్తుంది.

ధనం బాగా సంపాదించినట్లైతే సుఖశాంతులు పొందవచ్చునను కుంటాడు మానవుడు. కాని ధనవంతుడికి ఎప్పుడూ అశాంతే. ఈ అశాంతికి కారణం ఏమిటో మానవుడు చక్కగా గ్రహించి, దానిని తొలగించుకోగలిగితే శాంతి అతని సొమ్ము అవుతుంది. మన యింట్లో దుర్గంధం వస్తోంది అనుకోండి. అది ఎందువలన వస్తోంది అని మనం యిల్లంతా వెదుక్కుంటాము. ఏ మూలనో చచ్చిన ఎలుక కనబడుతుంది. దానిని తీసి అవతల పారవేస్తే ఆ దుర్గంధం దానంతట అదే పోతుంది. అంతేగాని, దాని కోసం వెదుక్కోకుండా, ఆ చచ్చిన ఎలుకను తీసిపారవేయకుండా, మనం యింటినిండా ఎన్ని సెంటుసీసాలు పారబోసినా, ఆ దుర్గంధాన్ని ఆపగలమా? దాని వల్ల రోగాలు రాకుండా చేయగలమా?

"అలా అయితే ధనం ఆర్జించటం తప్పంటారా? ధనం లేకపోతే దారాపుత్రాదుల పోషణ ఎలా జరగాలి", అని కొందరు తెలివిగా ప్రశ్నిస్తారు. ధనం ఆర్జించవద్దని గాని దారాపుత్రాదులను పోషించవద్దని గాని మెడ మీద తలకాయ ఉన్న వాడెవడూ అనడు. కాని ఎంతవరకు నీ దారాపుత్రాదుల పోషణకు, నీ గృహస్థ ధర్మ నిర్వహణకు, అది అవసరమో, అంతవరకే ఆర్జించు. అది కూడా ధర్మం తప్పకుండా సక్రమ మార్గంలోనే ఆర్జించుగాని, అధర్మంగా అక్రమంగా ఆర్జించవద్దు.

ఆర్జించిన దానిని సద్వినియోగం చెయ్యి. అంటే నీకు, నీ కుటుంబ పోషణకు కావలసిన ధనం ఖర్చు చేసి, ఏమైనా మిగిలితే అది ధర్మ కార్యాలకు దైవ కార్యాలకు వినియోగం చెయ్యి. ధనానికి, దాని వల్ల పొందగలిగే సుఖాలకి ఎంత విలువ యివ్వాలో అంతే విలువ యివ్వు. ఎక్కడ ఫుల్‌స్టాప్ పెట్టాలో అక్కడ పెట్టు. నీ మనస్సును మాత్రం ఫుల్‌స్టాప్ లేకుండా భగవంతుని స్మరణలో ధ్యానంలో ఉంచు. గాఢ విశ్వాసం పెంపొందించుకో. డైనమోను ఎంత వేగంగా తిప్పితే అంత బాగా కరెంటు వస్తుంది. దాన్ని స్టోరేజి చేసి ఎన్నిటికో వాడుకోవచ్చు. అలాగే నీ మనస్సును కూడా ఆ దివ్యనాధుని చరణారవిందముల యందు నిలిపి ధ్యానిస్తే అది నీకు అపారమైన

శక్తినిస్తుంది. గాఢమైన విశ్వాసం భగవంతుని యందు కలిగినపుడే భగవంతునిపై మనస్సును నిలుపగలుగుతావు. గాఢ విశ్వాసమంటేనే భక్తి. భక్తి వల్లనే శక్తి వస్తుంది. ఆ శక్తి వల్లనే నీవు నీ యింద్రియాలను, మనస్సును జయించ గలుగుతావు. ఆ శక్తి పొందనిదే మానవుడు ఒక చిన్న సంకల్పాన్ని కూడా జయించలేడు.

డైనమోను వేగంగా త్రిప్పితే కరెంటు ఎక్కువగా వచ్చినట్లే, ధ్యానంలో కూర్చొని జపమాలను అరిగిపోయే వరకు వేగంగా త్రిప్పితే గాని, నోటితో నామాన్ని బాగా స్పీడుగా నోరు నొప్పి పుట్టేవరకు జపిస్తే గాని శక్తి వస్తుందా? రాదు. ఎందువలన? జపమాల కన్న స్పీడుగా, నామం కన్నా స్పీడుగా మనస్సు విషయాలపైన, కోరికలపైన నువ్వు ఊహించలేనంత స్పీడుగా, క్షణాల్లో అన్ని లోకాలను, అన్ని వ్యవహారాలను చుట్టి వస్తూ తిరుగుతూనే ఉంటుంది. ఇక ధ్యానం ఎక్కడ కుదురుతుంది? శక్తి ఎక్కడ నుంచి వస్తుంది? అలా కాదు. అలా చలించే మనస్సును గమనిస్తూ, దానిని జాగ్రత్తగా మళ్ళీ భగవానుని దివ్య చరణారవిందములపైకి మళ్ళిస్తూ ఆ పాదముల యందే మనస్సును స్థిరంగా నిలిపే ప్రయత్నం, పట్టు విడవకుండా, నిరుత్సాహ పడకుండా కొనసాగించాలి.

ఆ ప్రయత్నం ఫలిస్తున్న కొద్దీ జపమాల దానంతట అదే నిలిచిపోతుంది, నామజపం అదే ఆగిపోతుంది, కాలాన్ని మరచిపోతాము. సాధన చేసే సమయంలో బాబు అనుభవం మీకు చెబుతాను. టిక్కుటిక్కుమనే గడియారం ఒకటి దగ్గర పెట్టుకోవాలి. మనం కూర్చున్నప్పటి నుండి రెండు గంటల తర్వాత అలారం మోగేటట్లుగా పెట్టుకోవాలి. అప్పుడు ధ్యానానికి కూర్చోవాలి. అలా కూర్చుని ధ్యానం చేసేటప్పుడు, ఆ టిక్కు టిక్కుమనే శబ్దము, ఆ అలారం మోత ఎప్పుడు మనకు వినపడకుండా పోతాయో అప్పుడు ధ్యానం కుదిరినట్లు. కాని మధ్యలో నిద్రలోకి మాత్రం జారుకోరాదు సుమా! అలా ధ్యానం కుదిరితే కలిగే ఆనందాన్ని ఒక్కసారి రుచి చూస్తే, యిక మానవుడు దానిని వదులుకోలేడు. దాని ముందు అతని ఈ ప్రాపంచిక రుచులన్నీ వెలవెలపోతాయి. అలా వీడు (తనను చూపించుకుంటూ) పొందిన ఆనందాన్ని ప్రతి ఒక్కరూ పొందాలి. ఒక్క మానవుడు ఆ ఆనందాన్ని పొందినా, నా జన్మ తరించినట్లు భావిస్తాను. అందుకే వీడు (బాబు) పుట్టింది.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

తండ్రి తనని యమునికిస్తాను అంటే నచికేతుడేమీ భయపడలేదు. మనం కాలాన్ని అధిగమించి కాలస్వరూపుడైన భగవానుని తెలుసుకోవలసిందే కదా! ఎంతటి ఆత్మ స్థైర్యం! మనకి పట్టుదలే ఉండాలిగాని యమలోకానికే కాదు, ఏ లోకానికైనా వెళ్ళవచ్చు.



తండ్రి అన్నమాటని సత్యం చేయడానికి నచికేతుడు వెంటనే యమలోకానికి ప్రయాణమై వెళ్ళిపోయాడు. అక్కడికి వెళ్ళేసరికి యమధర్మరాజు ఇంట్లో లేడు. లేడుకదా అని ఆయన కోసం ఎవరు వేచి ఉంటారులే, అని తిరిగి వెళ్ళిపోలేదు నచికేతుడు. యముడు వచ్చేంత వరకు అక్కడే ఉంటానని చెప్పి ఇంటిలోపలికి రమ్మన్నా కూడా లోనికి వెళ్ళకుండా, నిద్రాహారాలు విడచి, కనీసం మంచినీరైనా కూడా త్రాగకుండా యమసదనం యొక్క వాకిలి బయటే మూడురోజులు నిలుచుని ఉన్నాడు అతడు.

ఇందులో మూలంగా గుర్తించేదేమిటంటే మనం మహాత్ముల సన్నిధికి, సద్గురుదేవుల దర్శనానికి వెళ్ళి మూడురోజులు కాదు, మూడు గంటలు వేచి ఉండాలంటే ఉంటున్నామా? ఉండగలమా? వారి దర్శనం అయ్యేంతవరకూ కూర్చోను, ఏమీ తాగను, తినను అని ఎదురుచూశాడు నచికేతుడు! మరి ఈనాటి భక్తులో! 'మేము ఇంకో ఊరి నుండి వచ్చామండీ. మేము స్వామివారి దర్శనం చేసికొని వెంటనే వెళ్ళిపోవాలి' అంటున్నారు. స్వామివారు అంతకు ముందు వరకూ అక్కడే అందరికీ ఇంటర్వ్యూలు ఇచ్చి ఇప్పుడే లోపలికి వెళ్ళారు. ఇప్పుడు చాలా ప్రొద్దుపోయింది. వారిప్పుడు అనుష్ఠానంలో ఉంటారు అని ప్రక్కవారు చెప్పినా కూడా, వీల్లేదని నిర్బంధించే నేటి భక్తుల భక్తిని ఏమని కొనియాడాలి?

మూడు రోజులపాటు చేసిన నిరీక్షణలో నచికేతునిలో ఇంకా మిగిలిఉన్న కర్మబీజాలన్నీ దగ్ధమయి పోయాయి.

**యస్యసర్వే సమారంభాః కామసంకల్ప వర్జితాః**
**జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః** భగవద్గీత(4/19)

అంటే ఏ మహానుభావుడు తన మనస్సులో నుండి సమస్త కామ సంకల్పములనీ జ్ఞానాగ్నిలో దగ్ధం చేసికొని పనులను నిర్వహిస్తాడో అటువంటివాడే 'పండితుడు' అని జ్ఞానులచేత పిలవబడతాడు. గురుమూర్తి 'ధ్యానాగ్ని దగ్ధ కర్మాణం' అనేవారు. ఇక్కడ నచికేతుడు నిద్రాహారాలు మాని, శారీరక సుఖం కూడా చూడకుండా, గురుమూర్తికై మూడురోజులు అకుంఠిత దీక్షతో వేచి ఉన్నాడంటే, అది ధ్యానమే కదా! 'మొదటి శిక్షణలోనే ధ్యానమనే అగ్నిచేత కర్మలన్నీ దహింపచేసుకుంటే ఎలా ఉంటుంది', అని గురుదేవులు ఒక భక్తుణ్ణి అడిగారు. అటువంటి వారి దృష్టి, ఆచరణ, కామక్రోధాధి గుణరహితమై ఆనందకరంగా ఉంటుంది.

తండ్రి మాటమీదే యమలోకానికి వెళ్ళాడు నచికేతుడు. అక్కడికి వెళ్ళాక యముని రాకకై మూడు రోజులు వేచి ఉండటంలోనే ఆయన యొక్క శ్రద్ధ, తితీక్ష మనకి తెలుస్తున్నాయి. ఆ తరువాత యముడు పర్యటన ముగించుకుని వచ్చి తన ద్వారం బయట నిలుచుని ఉన్న బ్రాహ్మణబాలుని చూచి, ఎంతో మనస్తాపం చెందుతాడు. తన వలన జరిగిన అపరాధానికి బదులుగా మూడు వరాలు కోరుకోమని నచికేతునితో చెబుతాడు. అప్పుడు నచికేతుడు మొదటి వరంగా తన తండ్రి తనపై ఉన్న కోపాన్ని ఉపసంహరించుకొని, శాంత చిత్తంతో, యమలోకం నుండి తిరిగి వెళ్ళిన తనని గుర్తించి, ఆదరించాలని కోరుకుంటాడు. యముడు 'తథాస్తు' అంటాడు. ఈ కోరిక కోరటంతో పుత్రుడుగా తన బాధ్యత నెరవేర్చుకున్నాడు నచికేతుడు.

రెండవ వరంగా నచికేతుడు జీవుడు స్వర్గానికి వేళ్ళే యజ్ఞం గురించి చెప్పమంటాడు. అటువంటి యజ్ఞం ఎలా చేయాలో, అగ్నిహోత్రం గురించి, హోమగుండాన్ని ఎలా నిర్మించాలో, హోమాన్ని ఎలా నిర్వహించాలో అంతా పూర్తిగా వివరిస్తాడు యమధర్మరాజు. ఏకసంథాగ్రాహియైన నచికేతుడు యముడు చెప్పినవన్నీ అక్షరం పొల్లుపోకుండా తిరిగి ఆయనకు చెప్తాడు.

అటువంటి శ్రద్ధ కలిగిన శిష్యుణ్ణి చూసి ఏ గురువు ఆనందించరు? యమధర్మరాజు కూడా ఆనందంతో ఉప్పొంగిపోయి, 'నాయనా! నీ శ్రద్ధకి నేను ముగ్ధుడనయిపోయాను కనుక నీకొక 'ఎక్స్ట్రా' వరం ఇస్తున్నాను. ఇక మీద నుండి నీకు నేను చెప్పిన ఈ అగ్ని కార్యము నీ పేరుమీద 'నచికేతాగ్ని' అని పిలువబడుతుంది. 'ఇక నీ మూడవ వరాన్ని కోరుకో', అంటాడు.

అప్పుడు నచికేతుడు, "స్వామీ! మానవుడు చనిపోయిన తరువాత ఉన్నాడని కొందరు అంటారు; లేడని కొందరు అంటారు. దీని గురించి మీరు దయయుంచి చెబితే విని నేర్చుకోవాలనేదే నా మూడవ కోరిక" అంటాడు.

దీనిని బట్టి ఆ చిన్నారి బాలునికి ఉన్న సత్యాసత్యవివేకము లేదా ఆత్మానాత్మ విచారము తెలుస్తోంది. అదీ 'పరిప్రశ్న' అంటే. ఎంతో చక్కగా సేవ చేసికొని వినయ భయభక్తులతో, ఏది తెలిసికొంటే ఈ మానవ జన్మకి సార్థకతో దానిని గురించి ప్రశ్నించాడు.

అడిగిన వెంటనే ఇచ్చేస్తే మరి దాని విలువ నిజంగా తెలిసే అడుగుతున్నాడో లేదో అని గురుమూర్తి కూడా అనేక పరీక్షలు పెడతారు. ఊపి ఊపి చూస్తారు. ఇక్కడ గురుస్థానంలో ఉన్న యమధర్మరాజు వారు కూడా అదే చేశారు. ఆయన నచికేతుడికి అనేక ప్రలోభాలు ఎరచూపించారు. "నాయనా! ఎందుకయ్యా ఇంత చిన్న వయస్సులో ఇటువంటి కోరిక నీకు? నీకు అనేక వేల సంవత్సరాలు దీర్ఘాయుష్షునిస్తాను. నూరేండ్లు బ్రతికే పుత్రపౌత్రాదులనిస్తాను. ఎంత బంగారం కావాలంటే అంత బంగారము, ధనరాశులు, భూమి, గుఱ్ఱాలు, పశుసంపద, ఏనుగులు రథాలు ఒకటేమిటి, ఏది కావాలంటే అదే ఇస్తాను. వేలాది అప్సరస స్త్రీలు కావాలని కోరుకో, ఇచ్చేస్తాను. నిన్ను ఈ భూమండలానికి అంతటికీ చక్రవర్తిని చేస్తాను. నీకు తీరని కోరిక అనేదే ఉండదు", అంటాడు.

తాను విన్న విషయాలన్నీ తృణప్రాయంగా తీసి అవతల పారేశాడు నచికేతుడు. "ఓ యమధర్మరాజా! నువ్వు చెప్పిన భోగాలన్నీ కూడా క్షణికములేగా? అవి ఇంద్రియ బలాన్ని క్షీణింపజేసేవే కదా? ఎన్ని వేల సంవత్సరాలు ఆయుర్దాయం ఇచ్చినా ఏదో ఒక రోజు నాప్రాణం తీసికొని పోకుండా వుండవు కదా? కనుక, నువ్విస్తానన్నవన్నీ నీ దగ్గరే ఉంచుకో. నేను కోరిన పరమతత్త్వం ఏదైతే ఉందో అది తప్ప ఇక ఏ ఇతరమైన కోరికా ఈ నచికేతుడు కోరడు" అంటాడు. దీనినే సాధన చతుష్టయ సంపదలోని 'ఇహ అముత్ర అర్థ ఫలభోగ విరాగము' అంటారు. అంటే ఈ లోకంలో సుఖాలయందుగాని, స్వర్గాది లోక సుఖాలయందుగాని, సంపూర్ణమైన విరాగం అంటే వైరాగ్యం కలిగి ఉండటం. అది నచికేతుడికి ఎంత దృఢంగా ఉందో చూశారా! ఆత్మతత్త్వమనే వెల లేనటువంటి ధనరాశిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న సమర్థులైన సత్యగురువుల దగ్గరకు వెళ్ళి "మాకు పిల్లలు కావాలి; మా పిల్లవాడికి పెళ్ళి ఎప్పుడవుతుంది? మా బిజినెస్‌లో లాభాలు రావాలి; మా ఉద్యోగంలో ప్రమోషన్ రావాలి అనే కోరికలే కోరుకుంటున్నారే ఈ మానవులు" అని మన గురుదేవులు ఎప్పుడూ వాపోయేవారు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

గురు రక్షక కవచం ఎలా ఉంటుందో మాణిక్యంగారి విషయం చెబుతాను. ఒకనాడు ఆయన శిష్యులంతా చుట్టూ చేరి ఉన్న సమయంలో మాణిక్యంగారు మీరే నిజమైన శిష్యులైతే క్రింద ఉన్న కాలువలో దూకండి చూద్దాం అన్నారు. ఆయన శిష్యులలో క్షత్రియులంతా అంతవరకు వినయంగా ఆయనకి దగ్గరగా ఉన్నా వెంటనే దూరంగా వెళ్ళిపోతారు. ఆ శిష్యులలో ఒక గాజులు అమ్ముకొనేవాడు ఉన్నాడు. అతడు మాత్రం వెంటనే క్రిందనే ఉన్న కాలువలో దూకుతాడు. కాని ఆ వ్యక్తి మాత్రం మాణిక్యంగారి పాదాల చెంతనే ఉంటాడు. అక్కడ ఉన్నవారంతా చూసి ఆశ్చర్యపోయారు. చూశారా! గురుదేవుని నమ్మినవారికి లోటు ఏముంది? అన్నారు శ్రీబాబు.

**20-5-1985**

ఈ రోజు రమణగారి పెద్దబ్బాయి పుట్టినరోజు సందర్భంగా రాత్రి సత్సంగ సమావేశము జరిగింది. రావుగారు శ్రీబాబుని ప్రశ్నిస్తూ, "భగవంతుణ్ణి మనం భజన ద్వారా స్తుతించి, కీర్తిస్తేగాని ఉపకారం చేయడా? అలాంటప్పుడు భగవంతునికి, సాధారణ వ్యక్తికి తేడా ఏమిటి", అని ప్రశ్నించారు.

శ్రీబాబు సమాధానం చెబుతూ భగవానుడు సగుణ నిర్గుణ రూపంగా, గురు రూపంగా ప్రకాశిస్తున్నాడు. మానవుడు ఎంత చదువుకున్నా తాను ఆర్జించిన విద్యని ఎలా నిరూపించుకోగలడు? తాను నేర్చుకున్న అక్షరాలని తనలో చూపగలడా? పోనీ తనకు వచ్చిన కడుపునొప్పికి రూపం ఉందా? అక్షరాలకి రూపం ఉందా? అలాగే తాను బాధపడే కడుపునొప్పికి రూపం ఏమిటి? నమ్మనివాడికి విచిత్రంగా ఉంటుంది.

భగవంతుడు నీకు భిన్నంగా ఉన్నాడా? నీలోనే ఉన్నాడు. కాని దానిని గ్రహించకుండా నీ మనస్సు అనే ఆవరణ అడ్డుపడుతోంది. ఆ మనస్సును నిశ్చల స్థితిని పొందింప జేస్తేనే నీవెవరో నీవు తెలుసుకుంటావు. మనస్సు నిర్మలత్వాన్ని పొందటానికి ఈ కలియుగంలో అతి తేలికైన మార్గం నామసంకీర్తన. భగవానుడు ఎక్కడ ఉన్నాడో తెలియక తనకి దూరం

చేసుకుంటున్నాడు. విశ్వాసం ఉన్నవాడికి భగవంతుడు ఎప్పుడూ ఉన్నాడు. కపట భక్తుడికి మాత్రం కనబడడు. ఇక్కడ ఉన్నవారంతా ఏనాటికైనా కన్ను మూసేవారే కదా! ఈ విషయాన్ని గ్రహించి మన జీవితానికి పరమార్ధం ఏమిటో తెలిసికోవాలి.

సాధనకి అతి ముఖ్యమైన ప్రతిబంధకం సోమరితనం. భోపాల్‌లో విషవాయువు ఏ రకంగా అపకారం చేసిందో, వాతావరణాన్ని కలుషితం చేసిందో అదే విధంగా సోమరితనం శరీరంలో వ్యాపించి పతనానికి దారి తీస్తుంది. తాను పతనమవ్వటమే కాక ఇతరులని కూడా పతనం చేస్తుంది. అటువంటి వాడికి పవిత్రమైనది అపవిత్రంగాను, అపవిత్రమైనది పవిత్రంగాను కనబడుతుంది. సోమరితనం వలననే సందేహాలు కలుగుతాయి అన్నారు శ్రీబాబు.

రావుగారు మాట్లాడుతూ,"భగవంతునియందు విశ్వాసం ఉన్నట్లు ఎలా తెలుస్తుంది", అని ప్రశ్నించారు.

శ్రీబాబు మాట్లాడుతూ, "తిరుపతి క్షేత్రంలో వేంకటేశ్వరుని దర్శించిన శిల్పికి శిల్పచాతుర్యము, స్వర్ణకారునికి ఆభరణముల శోభ, భక్తునికి దివ్యమంగళ స్వరూపము గోచరిస్తాయి. నీటిలో సగం మునిగినప్పుడు బుడబుడమని శబ్దం వస్తుంది. కానీ పూర్తిగా మునిగినప్పుడు ఏ శబ్దమూ ఉండదు. అలాగే భగవంతుడి యందు ప్రగాఢమైన విశ్వాసం ఉన్నవాడికి ఏ సంశయమూ ఉండదు. విశ్వాసము ఏ మాత్రము సడలినా మనస్సు సందేహాలకు నిలయమై భగవానునికి దూరమవుతారు. అయినా మీరు పండితులు మీకు మేము చెప్పాలా", అన్నారు.

రావుగారు మాట్లాడుతూ కావ్యాలు చాల గొప్పవి, అవి తరిగేవి కాదు. ఎప్పుడూ ఆనందాన్ని ఇస్తాయి. కాబట్టి వాటిని రచించిన కవులు గొప్పవారు. వారు జ్ఞానికన్న గొప్పవారు. ఎందువలనంటే జ్ఞాని ఆనందాన్ని తానొక్కడే పొందుతాడు. మరి కవి తాను ఆనందించటమే కాక, అందరికీ ఆనందాన్ని అందిస్తాడు అన్నారు.

శ్రీబాబు గాంభీర్యంగా మాట్లాడుతూ, "ఏది కావ్యం అని పిలువ బడుతుంది? ఏది అయితే చదివినంత మాత్రానే ఆనందాన్ని ఇస్తుందో, ఏది పరమాత్మ తత్వాన్ని తెలియజేస్తుందో, ఆయన దివ్యచరణారవిందాలని చేరుస్తుందో, ఏది జనన మరణ మృత్యురూపం నుండి రక్షిస్తుందో అదే

కావ్యం అని పిలువబడుతుంది. ఏది కోతిని జ్ఞానిగా మార్చిందో, ఏది బోయవాడిని జ్ఞానిగా మార్చిందో అదే కావ్యం. అట్టి కావ్యాన్ని రచించిన పోతనామాత్యుడు జ్ఞాని. వారు ధనధాన్యాలకు అమ్ముడుపోయారా? అవి ఈనాటికీ ప్రకాశిస్తున్నాయి. త్యాగయ్య కీర్తనలు ఈనాటికీ ప్రకాశిస్తున్నాయి కదా", అన్నారు. రావుగారు మాట్లాడుతూ, "మీరు చెప్పినది చాలా బాగుంది. నా సందేహాలు తీరాయి", అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ సరస్వతీదేవిని కవయిత్రి అంటే ఎలా ఉంటుందండీ! కృష్ణపరమాత్మను మంచి కవి అంటే ఎలా? శివుడిని మహాయోగి అంటే అది వివేకం అంటారా? చెప్పండి. దీనిలో ఉండే సూక్ష్మతను గ్రహించండి. ఇంక సందేహాలు రావు అన్నారు శ్రీబాబు.

**21-5-1985**

ఈ రోజు ఉదయం శ్రీబాబు వ్యాహ్యాళికి వచ్చినప్పుడు చరణదాస్ ప్రశ్నిస్తూ, "మన దేశంలో ఎంతోమంది బాబాలు, మహాత్ములు ఉన్నారు కదా! వారు దేశంలో అరాచకాన్ని నిర్మూలించి అందరికి సుఖశాంతులు చేకూర్చ వచ్చు కదా", అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ,"మహాత్ములంటే ఎవరనుకుంటున్నారు? వారు కేవలం పరమాత్మ స్వరూపులు. వారి చల్లని చూపు యొక్క కిరణాలతో సదా యావత్తు ప్రపంచమూ సుఖశాంతులతో వర్ధిల్లుతోంది. మహాత్ములు సకల జీవకోటికి ఏది సత్యమో, ఏది అసత్యమో తెలియజేస్తారు. మానవ జీవితం ఎలా ఉంటుందో ఒక ఉపమానం చెబుతాను. బియ్యం మానవునికి మంచి ఆహారం. కాని ధాన్యము పండేటప్పుడు దానిలో రాళ్ళు కలుస్తాయి. వ్యాపారస్థులు బియ్యంలో రాళ్ళు కలిపి విక్రయిస్తారు. బియ్యాన్ని పోలిన రాళ్ళను కలుపుతారు.

మానవుడు జన్మతః సంచితార్థ కర్మని మూటకట్టుకుని వస్తాడు. జన్మ ఎత్తిన తరువాత కూడా దుష్కృత కర్మల ద్వారా కర్మని ఆర్జిస్తాడు. ఈ కర్మని రహితం చేసుకోవాలంటే ఎన్ని జన్మలెత్తినా సాధ్య పడుతుందా? అది సాధ్యపడాలంటే ఒక మహాత్ముణ్ణి ఆశ్రయించాలి. ఆయన ప్రసాదించిన లక్ష్యార్థంపై మనస్సు నిలిపి ధ్యానించాలి. బియ్యం స్వచ్ఛంగా తెల్లగా ఉండాలంటే దానిలో ఉండే రెండు రకాల రాళ్ళని ఏరివేయాలి".

-సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**జనవరి 2011**

**1 శని** ఆంగ్ల సంవత్సరాది, శ్రీ సద్గురు పాదపూజ - భక్త సమారాధన

**14 శుక్ర** మాస శివరాత్రి, భోగి, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన, రాత్రి 8 గం.లకు శ్రీ సద్గురుదేవులకు భోగి పళ్ళు పోయుట

**15 శని** మకర సంక్రాంతి,శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**16 ఆది** కనుమ, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**19 బుధ** పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ

**28 శుక్ర** శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

**ఫిబ్రవరి 2011**

**1 మంగ** మాసశివరాత్రి

**10 గురు** రథసప్తమి

**14 సోమ** భీష్మ ఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ. సత్సంగం, పెద నింద్రకొలను బ్రాంచిలో శ్రీ గురుదేవుల దివ్య మంగళమూర్తి ప్రతిష్ఠా సప్తమ వార్షికోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

**18 శుక్ర** మాఘపూర్ణిమ, శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

**27 ఆది** శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

# శ్రీమాతాజీవారి నవరాత్రి సందేశాలు

- మేధ

శ్రీమాతాజీ భక్తులకు ఉద్బోధిస్తూ, "సాధకులంతా తాము ఎందుకు సాధన చేస్తున్నాము అనే విషయాన్ని తెలుసుకోవాలి. అవగాహన కావాలి. అంతేకాదు నీ గమ్యస్థానం తెలియాలి. అది గ్రహిస్తే మనస్సు తప్పక మన మార్గానికి వస్తుంది.

ధ్యానం మనకి భిన్నం కాదు. మనము ధ్యానములోనే ఉన్నాము. పరధ్యానం దుర్గంధాన్ని తెస్తుంది. మనస్సు నీకు భిన్నంగా ఉంటే పొల్లుమాటలు వస్తాయి. మనస్సు లయిస్తే అనవసరమైన మాటలు రావు. మనస్సు ఎప్పుడు ఏకాగ్రత పొందితే అదే ప్రాతఃకాల ధ్యానం. మనస్సు తానే అయినప్పుడు తెలుసుకోవటం అనే ప్రశ్న ఉదయించదు.

ధ్యానము, ధ్యాత, ధ్యేయము ఏకమైనప్పుడు ఇంక ఏముంది. అదే సమాధిస్థితి. కాని బస్సు ప్రయాణంలో నిద్రపోతుంటే అది ధ్యానం అనిపించుకుంటుందా? పట్టుదల ఉండాలి.

సాధించాలి అనే ఆవేదన తీవ్రమైనప్పుడు అనుగ్రహము మన సొత్తు. పట్టుదలతో గోపికలు సాధించగలిగారు. శబరి స్వామి అనుగ్రహాన్ని జుర్రుకుంది. సాధకునికి ప్రకృతి అనే మాయ అవరోధాన్ని కలిగించి చెడగొట్టటానికి ప్రయత్నిస్తుంది.

పుష్పాలు సువాసన వెదజల్లినంత మాత్రాన ఆకర్షింపబడి వాటిని తెచ్చుకుంటున్నామా! మనకి అవసరమైనప్పుడు వాటిని ఎంత ఖరీదైనా కొనుక్కుంటున్నాము. అలాగే ఆహార పదార్థాల సువాసన ముక్కుపుటాలకి చేరినంత మాత్రాన వాటిని తింటున్నామా? మనకు ఆకలివేసినప్పుడు మాత్రమే తింటున్నాము.

మనము సద్గురుదేవుల దివ్య చరణారవిందాలను ఎందుకు ఆశ్రయించాము? వాటికి విముఖమై మనము జీవించగలమా? ఆయన దయ పరిపూర్ణమైనది. సర్వసృష్టి ఆయనదే. గోపికలు ప్రపంచాన్ని మరచి తాము ఆశ్రయించిన ప్రభువును ప్రేమించారు. ఇంద్రియాలు మనస్సుకి జిడ్డుపట్టిస్తున్నాయి. మనస్సు తామరాకు స్థితికి రావాలి. దేహాభిమానమే

పంచముడి. దానిని విచ్ఛిన్నం చేయగల సమర్థులు గురుదేవులే. విశ్వాసం ద్వారా సద్గురుమూర్తి అనుగ్రహాన్ని సాధించాలి. శ్వాస పోయినా ఫరవాలేదు. విశ్వాసాన్ని పోగొట్టుకోకూడదు.

మన వీపు మనం చూసుకోలేము కదా! జగత్తుని వీక్షించే మన కన్నుని మనం చూసుకోలేము. కాబట్టి మనకి ఆశ్రయాన్ని ప్రసాదించిన సద్గురుమూర్తి దివ్యచరణారవిందములను పరిపూర్ణ విశ్వాసముతో ఆశ్రయించి వారు ప్రసాదించిన దివ్యబోధని మనస్సులో పదిల పరచుకున్నవాడికి ప్రపంచంలో ఏదైనా సత్యంగానే గోచరిస్తుంది. సంశయానికి తావులేదు.

నీకు తోడు నువ్వు ఆశ్రయించిన ప్రభువే తప్ప అన్యులెవరూ ఏరకంగానూ సహాయపడరని తెలుసుకో. ప్రభువు ప్రసాదించిన జ్ఞానాన్ని 'నేను' అనేది తలెత్తకుండా అనుభవించాలి. మనలో లోపము జన్మజన్మల నుంచి ఆర్జించిన సంస్కారబలమే. దానికి ఇంకా కర్మని చేరిస్తే ప్రయోజనమేముంది? కంపే కదా!

నీ మనస్సు బయటకి తీసికెళ్ళకుండా గురుదేవుల బోధని అందించిన దివ్య క్షేత్రములో నిలిపితే సమాధికాక మరేమిటి", అని అన్నారు శ్రీమాతాజీ.

## టీ.వి.లో శ్రీమాతాజీవారి కార్యక్రమాలు

*ప్రతిరోజు భక్తి ఛానెల్‌లో ఉదయం 5 గం॥ నుండి మరియు టి.వీ -(1) ఛానెల్‌లో 5గం॥30ని॥ నుండి మరియు భక్తి ఛానెల్‌లో అదనంగా ప్రతి శుక్రవారం, శనివారం సాయంత్రం 5 గం॥నుండి ప్రసారమౌతున్నాయి. భక్తులు విని తరించ గలరు.*

# కృష్ణతత్వము, ప్రేమ యోగము

- సుషుమ్న ప్రసాద

(గత సంచిక తరువాయి)

ప్రవీరుడు సామాన్య వీరుడు కాదు. అర్జునుడు వదలిన శరపరంపరను చాకచక్యముతో తిప్పికొట్టాడు. అర్జునుని హస్తాలు వణకటం ప్రారంభించాయి. అప్పుడు కృష్ణ పరమాత్మ, "అర్జునా నా సహకారము పూర్తిగా ఉన్నా, నీవు జయించ లేకపోవటానికి కారణమేమిటి", అని ప్రశ్నించాడు. వెంటనే అర్జునుడు, "కొంచెం సేపు సహనము వహించండి ప్రభూ. శత్రువును జయిస్తా"నని శక్తివంతమైన ఆగ్నేయాస్త్రమును ప్రయోగించాడు. కాని అతని ప్రయత్నం సఫలీకృతం కాలేదు. "కృష్ణ పరమాత్మ సహాయము లేకుండ, మహా వీరుడను అని విర్రవీగే అర్జునా, నన్ను జయించటము సాధ్యము కాదు" అన్నాడు ప్రవీరుడు.

మరల ప్రవీరుడు కృష్ణ భగవానునుద్దేశించి, "ప్రభూ, మీరు మా ఇద్దరికీ అత్యంత ఆప్తులే. మీరు అర్జునుని రథసారథ్యము మాని, ఒక నిష్పక్షపాత ప్రేక్షకునిగా ఉండి, మా ఇరువురిలో ఎవరు ఉత్తమ వీరుడో నిర్ణయించండి", అన్నాడు. కృష్ణ పరమాత్మ అంగీకార సూచకంగా, చిరునవ్వు నవ్వగానే, భక్తునికి భగవంతునిపై ఉండే స్వేచ్ఛను సూచిస్తూ, ప్రవీరుడు స్వామిని రథమునుండి దింపి ఒక తాటి చెట్టుకు కట్టివేశాడు. కృష్ణ ప్రేమ ఎంత ఉదాత్తమంటే, దేనికీ బంధింప బడని దేవదేవుడు భక్తి సంకెళ్ళలో ఒదిగిపోయాడు. ప్రవీరుడు అప్పుడు అర్జునునితో, "ఇప్పుడు నీ ప్రతాపాన్ని చూపు", అని సవాలు చేసాడు. అర్జునుడు అప్రతిభుడైనాడు. "యోధానయోధులు ప్రయత్నించినా కౌరవ సభలో ఎవరిచేతా బంధింపబడని దేవదేవుడు ఒక చిన్న త్రాటితో బంధింపబడటమేమిటి? హే ప్రభూ, సర్వులనూ బంధవిముక్తులను చేసే మీరు బంధింపబడటమేమిటి", అని విలపించాడు. అర్జునుని దీనాలాపము వినగనే శ్రీకృష్ణ పరమాత్మ బంధమును ఛేదించుకొని అర్జునుని రథమధిరోహించాడు. మూర్తీభవించిన ప్రేమావతారమైన శ్రీకృష్ణ పరమాత్మ, మహాభక్తులైన ఇద్దరు ప్రత్యర్థుల మధ్య, వింత పరిస్థితిలో ఇరుక్కొన్నాడు.

ప్రవీరుడు యుద్ధభూమిలో విజృంభించి "స్వామీ, మీరు కొంచెం సేపైనా ఏ పక్షమూ వహించని ప్రేక్షకునిగా ఉండలేరా", అని మానవశక్తి కతీతమైన అస్త్ర ప్రయోగము చేసి, అర్జునుని శత్రుసైన్యమును చెల్లాచెదరు

చేశాడు. అప్పుడు భగవాన్ శ్రీకృష్ణ ప్రభువు అర్జునునితో, "ఒంటరిగా పోరాడి ప్రవీరుని ఎదుర్కొన లేవా! నీ సైన్యమునకు మానసిక ధైర్యమును కలిగించు", అన్నాడు. వెంటనే అర్జునుడు సైన్యమునుత్తేజపరిచి మహత్తర శస్త్ర ప్రయోగముతో ఆనాటికి విజయము సాధించాడు.

మరల రెండుమార్లు ప్రవీరుడు కృష్ణ పరమాత్మను తాటిచెట్టుకు బంధించటము జరిగింది. ప్రత్యర్థులైన భక్తాగ్రణ్యులిరువురితో వారి పక్షానే ఉన్నట్లు దాగుడు మూతలాడాడు. తాటి చెట్టుకు బంధింపబడినట్లు కనిపిస్తూనే, అర్జునుని ప్రార్థనను మన్నించి, రథముపై కూడ ప్రత్యక్షమైనాడు. అలా రెండుచోట్ల ప్రభువును దర్శించిన ప్రవీరుడాశ్చర్య చకితుడై, అర్జునునితో, "మీరు మిమ్మల్ని కన్న తల్లిదండ్రులు మహాభాగ్యశాలురు. మీ కొరకై స్వామి రెండు చోట్ల ప్రత్యక్షమైనాడు", అన్నాడు. ప్రవీరుడు అలా అంటూ ఆ భక్తి పారవశ్యంతో స్వామిపై దృష్టి నిలపగానే, ఆయనలోని ప్రేమ సముద్రము ఉప్పొంగి, వెల్లువై ప్రవహించింది. బాహ్యస్మృతిని కోల్పోయి, నిశ్చలమైన సమాధి స్థితిలో ప్రవీరుడు బ్రహ్మానందము ననుభవిస్తున్నాడు.

ఇదే అదును అని కృష్ణ పరమాత్మ ప్రవీరుని శిరస్సు ఖండించమని అర్జునుణ్ణి ప్రేరేపించాడు. "నిరాయుధుడై, నీ ధ్యానములో నిమగ్నుడైన భక్తుని వధించటము యుద్ధధర్మము కాదు", అన్నాడు అర్జునుడు.

అప్పుడు భగవాన్ శ్రీకృష్ణుడు అర్జునునితో, "నాకత్యంత ప్రియ భక్తుడు, మహావీరుడైన ప్రవీరునితో ముఖాముఖి పోరాడి గెలువగల వీరుడెవడూ లేడు. ధ్యాన నిమగ్నుడైన నా భక్తుని నాలో చేర్చుకొని, దివ్య ప్రేమనివ్వటమే నా ధ్యేయము. అందుచేత, నా ఆజ్ఞను పాలించి, ప్రవీరుని వధిస్తే, నీకే పాపము అంటదు", అని నిర్దేశించాడు. వెంటనే అర్జునుడు అర్ధచంద్రాకారములో ఉన్న మహాయుధమును ప్రయోగించి, ప్రవీరుని శిరచ్ఛేదము చేసాడు. ప్రవీరుని శిరస్సు కృష్ణ పరమాత్మ చరణకమలములపై పడ్డది. అందులోనుండి ఒక దివ్య తేజస్సు గోచరించి, స్వామిలో ప్రవేశించి లయమయింది. ప్రవీరుని మరణ వార్త విని, నీలధ్వజుడు దుఃఖించాడు. జ్వాలాదేవి తన కుమారుని వీర మరణమునకు గర్వించి, అశ్రువులు రాల్చింది. అప్పుడు కృష్ణ పరమాత్మ ఆ వీరమాతతో, "అమ్మా నీ కుమారుని పునర్జీవితుణ్ణి చేయమంటావా", అని అడిగాడు. అప్పుడు, "మీలో లయించిన మా పుత్రుడు ధన్యజీవి. అతనికి పునర్జన్మ లేదు. అదే స్థితిని నాకు కూడ ప్రసాదించు స్వామీ", అని ప్రార్థించింది

జాన్హాదేవి. ప్రేమమూర్తి అయిన శ్రీకృష్ణ పరమాత్మ ఆమె కోరిక తీరుస్తానని వాగ్దానం చేశాడు. కృష్ణపరమాత్మ నీలధ్వజుని అర్జునునకు మర్యాదపూర్వకమైన వీడ్కోలునిచ్చి అశ్వమేధ యాగసమయమునకు తగిన బహుమతులతో హస్తినకు వెళ్ళమని ఆదేశించాడు. అప్పుడు నీకు తిరిగి హస్తినాపుర దర్శనం లభిస్తుందని అభయమిచ్చి అదృశ్యమయ్యాడు కృష్ణపరమాత్మ.

పరమాత్మ ఆదేశించినట్లు నీలధ్వజుడు అర్జునునకు ప్రేమపూర్వకమైన వీడ్కోలు చెప్పి కృష్ణభజనలో పూర్తిగా లయమైపోయాడు. ప్రవీరుని ధర్మపత్ని మదనమంజరి భర్తతో సహగమనం చేసి, దివ్యనాధుని సన్నిధికి చేరుకొన్నది.

అలా ప్రేమయోగి అయిన కృష్ణపరమాత్మ తరతమ భేదములు లేకుండా సర్వులనూ తన మధురతత్త్వములో లయం చేసుకుంటాడు. *

ఒకప్పుడు ఇద్దరు సాధువులు దక్షిణేశ్వరమునకు వచ్చిరి. వారు తండ్రి, కొడుకులు. కుమారుడు బ్రహ్మజ్ఞాని. కాని తండ్రికింకను జ్ఞానోదయము కాలేదు. ఇరువురును శ్రీరామకృష్ణుని గదిలో కూర్చుండి యాతనితో సంభాషించుచుండిరి.

ఇంతలో ఒక ఎలుకకన్నము నుండి ఒక త్రాచుపాము వచ్చి కుమారుని కరిచినది. అది చూచి తండ్రి భీతిల్లిపోయి చుట్టుప్రక్కల ఉన్నవారందరినీ పిలువసాగెను. కాని కుమారుడు కదలక కూర్చుండెను. అది చూచి తండ్రి మరింత దిగ్భ్రాంతి చెంది 'నాయనా! అదేమి కదలక మెదలక కూర్చున్నావు? నీకు.....' అని అడగగా కుమారుడు నవ్వుచూ ఇట్లు సమాధానము చెప్పెను 'పాము అనగా ఏది? ఎవరిని కరచినది?'

అతడు అద్వైత సిద్ధిని బడసినవాడు. కావున పాముకు, నరునకు అతడు భేదమును పాటింపలేదు. సర్వమూ అతని దృష్టిలో బ్రహ్మమే!

- పరమహంస నీతికథా రత్నములు

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గత సంచిక తరువాయి) - సుశీలా ప్రసాద

**15శ్లో॥ అవ్యాజ మంజ్జుల ముఖామ్బుజ ముగ్ధభాలై**
**రాస్వాద్య మాన నిజవేణు వినోదనాదమ్,**
**ఆ క్రీడతా మరుణ పాద సరోరుహాభ్యా**
**మార్ద్రే మదీయ హృదయే భువనార్ద్ర మోజః ॥**

తన మనస్సులో ఎక్కడో ఏదో అలజడి. ఏ విధంగా అది తీరుతుందో తెలియటంలేదు. చెట్టుమీద కోయిల కూసినప్పుడు, పక్షుల కిలకిలరవాలలో, అలల గలగలల్లో తన మది ఊయ్యాలలూగుతుంది. కానీ తనకది చాలటంలేదు. పొద్దుపొడిచేసరికి విచ్చిన ప్రతిపువ్వు ఎంతో అందంగా కనిపిస్తోంది. కానీ ఆ అందం చూస్తున్నా తనకి తృప్తి అవటంలేదు. అమ్మ దగ్గర పాలు తాగిన తువ్వాయి గంతులేస్తుంటే దానికన్నా ఎన్నో రెట్లెక్కువగా తన హృదయం గంతులేస్తోంది. కానీ దానితో తనకి తనివి తీరటంలేదు. ఎలా...ఎలా...ఎలా....?

మాటలు రాకపోయినా నీలి మనస్సులో ఎన్నెన్నో భావాలు కదులుతుంటాయి. పేదవాళ్ళ పిల్ల నీలి. పాలుపెరుగులు అమ్ముకురావటానికి మధురానగరానికి దాన్ని పంపుదామంటే దానికి నోరులేదని వాళ్ళమ్మే వెడుతుంటుంది. ఒక చిన్న మడి చెక్క ఉంటే దాన్ని దున్నుకుని తమకి సరిపడే తిండిగింజలు పండిస్తుంటాడు తండ్రి. అందుకని పొయ్యిలోకి పుల్లలేరుకుని వచ్చే పనిని నీలికప్పగించారు, నీటితో పనిలేదుగనుక. వాళ్ళు ఇద్దరూ గూడు చేరుకునేసరికి ఇంత కూడు వండి పడేస్తుంటుంది నీలి.

ఒకనాడు ఏరిన పుల్లలన్నీ కట్టగట్టుకుని తలపైన పెట్టుకుని బాటమీద వస్తుంటే, కాలుజారి పక్కనే ఉన్న నీళ్ళ మడుగులో పడిపోయింది నీలి. తలకూడా నీళ్ళలో మునిగింది. అరుద్దామంటే గొంతురాదు. కేకలు పెట్టినా చుట్టు ప్రక్కల ఎవరూలేరు. నీళ్ళుమింగి కళ్ళుమూతలు పడి లోతులోకి వెళ్ళిపోతోంది. అప్పుడేదో ఆధారం దొరికింది. గట్టిగా పట్టుకుంది. ఒడ్డున పడుకోబెట్టినట్టయి కళ్ళు విడివడ్డాయి. ఎవరో చిన్నబాలుడు! తనవంక చూస్తూ నిలబడి ఉన్నాడు. ఎలా వచ్చాడో, ఎక్కణ్ణించి వచ్చాడో తెలియలేదు. ఓపిక తెచ్చుకుని లేచి నిలబడింది. ఆ పిల్లవాడు చిరునవ్వుతో నీలి చేతిని పట్టుకుని,

కట్టెలమోపు తన బజంమీద పెట్టుకుని నడిపించుకుంటూ వెళ్ళాడు. దోవ తెలిసిన వాడల్లే ముందుకి సాగి, ఇంటిదాకా తీసుకెళ్ళి, 'ఇక వెళ్ళ గలవా?' అని అడిగాడు. కృతజ్ఞతాభావాన్ని కళ్ళనిండా నింపుకుని నీళ్ళునిండగా వాని వంక చూస్తూ తల ఊపింది. జరిగిందంతా సంజ్ఞలతో తలిదండ్రులకు చెప్పిన నీలి ఆ బాలుడెవరో మాత్రం చెప్పలేకపోయింది. తమ బిడ్డ ప్రాణాలు నిలబెట్టిన కనబడని ఆ దైవానికి చేతులెత్తి దండం పెట్టారు వాళ్ళు.

మర్నాటినించీ నాలుగురోజులపాటు ఆ బాలునికోసం వెదికింది నీలి. కాని వాని జాడలేదు. అయిదోనాడు దారి పక్కన గడ్డిపరకలు కొరుకుతున్న లేడిపిల్ల కనిపిస్తే చూసిన నీలికి దాని కళ్ళు ఎంతో సొంపుగా కనిపించాయి. అదే సమయంలో తనని నీళ్ళలోంచి తీసినపుడు తనవంకే చూసిన ఆ బాలుని కళ్ళు గుర్తొచ్చాయి. ఏమి సొగసు? ఆ అందానికి ఏవీ సాటిరావు అనుకుంది మనస్సులో. కట్టెలేరుకున్నాక ఒక చెట్టునీడన మోకాలిమీద తల ఆన్చుకుని కూచుంది నీలి. ఎవరిదో నీడ తన ముందు పడినట్టయి తలెత్తిచూసింది. ఆ అందాల బాలుడే! ఆనందం పొంగొచ్చింది. లేచినిలబడింది. "ఎలా ఉన్నావు", అని ఎంతో ఆప్యాయంగా పలకరించాడు. బాగానే ఉన్నానన్నట్టు తలతిప్పింది. "చూసిపోదామని వచ్చాను. వెడుతున్నా"నంటూ ఛెంగున ముందుకి గెంతి క్షణంలో మాయమైనాడు. అలాగంతులేసినపుడు ఘల్లుమన్న వాని కాలిఅందెల చప్పుడు ఆమె చెవుల్లో మారుమ్రోగుతూ ఉండిపోయింది. మళ్ళీ మళ్ళీ చూడాలనే ఆ అందం, మళ్ళీ మళ్ళీ వినాలని కోరుకునే ఆ మువ్వల సవ్వడి... తదేక ధ్యాసలో నిలిచిపోయింది నీలి.

తెరిచిననోటిలో పెరుగుముద్ద పెడుతున్న తల్లితో, "అమ్మా! నేనోమాట చెప్తాను వింటావా", అన్నాడు కన్నయ్య. "నువ్వు చెప్పటం, నేను వినకపోవటం ఉందా నాయనా? ముందీ ముద్దతిని మరీ చెప్పు", అంది యశోదమ్మ. "నాలుగు రోజులనాడు గోవుల్ని మేపుకోవడానికి అడివికి వెళ్ళినపుడు మందలో ఒకావు దారి తప్పిపోయింది. దాన్ని వెదుక్కుంటూ వెళ్ళాను. ఆవు కనిపించింది. తిరిగొచ్చేదారిలో ఒకమ్మాయి కాలిబాట పక్కనే ఉన్న నీళ్ళ మడుగులో కాలుజారి పడిపోవటం చూసాను. చూస్తుండగానే నీళ్ళలోమునిగి పోతున్నది", అంటూ చెప్తున్న తనయుని మాటలు వింటూ ఆత్రంగా, "అయ్యో! ఏమైందప్పుడు చెప్పరా", అంది తల్లి.

-సశేషం

# మౌనధ్యాన సప్తాహశిబిరం

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

ఆయన పడుకొని ఉన్నాడు. చనిపోయినట్లు ఉన్నది. శ్వాస ఆడటం లేదు. అందరూ లబోదిబోమంటున్నారు, కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నారు. అంతలో సాధువుగారు అక్కడికి వచ్చారు. వచ్చేసరికి బాధంతా ఒక్కసారిగా పొంగింది.

"మీ దగ్గరకు ప్రవచనానికి ఒక్కరోజు కూడా మానకుండా వచ్చేవాడండి. సాయంత్రం అయిదున్నర కానిచ్చేవాడుకాదు. సాధువుగారు ప్రవచనం మొదలు పెడతారని వచ్చేసేవాడు. ఈరోజు ఇలా అయిపోయిందని ఏడుస్తున్నారు. సాధువుగారు "ఏమీ లేదు. ఇప్పుడు మీలో ఎవరైనా ఇంతమంది ఏడుస్తున్నారు కదా. ఒక్కరు మీ ప్రాణాన్ని త్యాగం చేసినట్లైతే మీరు ముందుకు వచ్చి, నా ప్రాణం ఆయనకిస్తాను అని అంటే అతను తప్పకుండా లేస్తాడు. ఎలా చేయాలో నేను చెప్తాను. మీరు రెడిగా ఉన్నారా", అని అడిగారు.

వెంటనే, ముసలాయన నాన్నగారు అన్నారట, "అయ్యో! నేనిప్పుడు పోయాననుకో. ఈ పెద్ద వయస్సులో మా ఆవిడని ఎవరు చూస్తారు? మా ఆవిడ ఏదో పునిస్త్రీ. ఇప్పుడు నేనుపోతే ఆవిడ పూర్వసువాసిని అయిపోతుంది. దాని గతి ఏమిటి? అమ్మో! నా ప్రాణం ఇవ్వను", అని అన్నాడు. తల్లి "అయ్యో! ఇప్పుడు కనుక నా ప్రాణాన్నిస్తే ఆ ముసలాయనకి ఎవరుగతి? నేను లేకపోతే ఆయన్ని చూసేది ఎవరు", అన్నది. భార్యదగ్గరకు వచ్చాడు సాధువు. భార్య "అయ్యో! పిల్లలున్నారు. ఇంకా చిన్నవాళ్ళు. పిల్లల్ని ఎవరు చూస్తారు, నేను నా ప్రాణాన్నిస్తే", అన్నది. ఇలా అందరూ సర్దుకుంటున్నారు. అంతలోనే శిష్యుడు, ఆ శ్రవణ భక్తుడు కాస్త లేచికూర్చున్నాడు. సాధువుగారు అతడిని చూసి, "ఏమయ్యా! ఇప్పుడేమంటావు", అన్నాడు. ఆ శ్రవణ భక్తుడు, "అయ్యా! బుద్ధి గడ్డితిని, మీరు అక్కడ చక్కగా ప్రవచనం చేస్తుంటే కూడా వీళ్ళందరూ నా మీద నిజంగా ప్రేమ చూపిస్తున్నారనుకొని వచ్చాను నేను. అయ్యయ్యో! ఎన్ని గంటలు ఇలా వృథా చేసానో" అన్నాడు.

ఇప్పుడు చెప్పండి మన మీద కూడ అందరూ మంచి ప్రేమనే చూపిస్తున్నారు కదా! జగత్తులో చూడండి. ఒకళ్ళకొకళ్ళు ఎక్కడో ఒక చోట

వట్టిగానే గుర్తింపు చేస్తూనే ఉంటారు. అవసరార్థ ప్రేమలు! ప్రపంచంలో కనిపించేవన్నీ కూడా అవసరార్థ ప్రేమలు. ఏమక్కర్లా. మీకు విరేచనాలు అవుతుంటే ముందు మందు తీసుకొనే శక్తి ఉండాలి కదా! తీసుకొనే శక్తిలేక ఇది నాకొచ్చినా బాగుండు అంటుంది తల్లి పిల్లాడికొస్తే! నిజంగా వస్తే తీసుకొనే వాళ్ళున్నారా? అది ఎక్కడో నూటికో కోటికో మన చరిత్రలో నిలచిపోయారు కాని మానవలని పిలవబడే వారిలో లేరు. అలాగే మన అపరాధాలెన్నో. భగవంతుడి దగ్గరకి వచ్చి అవాకులు చవాకులు ఎన్నో మాట్లాడుతుంటాం. నిజమైన అపరాధములన్ని మరచి ఆదరించవే మాతా॥

ఎంత ఉపకారమో తెలివిలేని అహములతో. మన అహములన్నీ ఎటువంటివి? ప్రజ్ఞ గలిగి ఉన్నాయా? తెలివి కలిగి ఉన్నాయా? తెలివి ఉన్నటు వంటి అహంకారాలా ఇవన్నీ? ఎవరో ఏదో అంటే ఎంతో పొడుచుకొస్తుంది కదా! అది మనం కాకపోతే మనకు ఎందుకు పొడుచుకు రావాలి! అది మనం కానప్పుడు మనకు ఎందుకు కోపం రావాలి? Take it easy. ఇందాక అన్నారు కదా!

ధ్యానం అంటే త్యాగమని. గురుదేవులు ఏం చెప్పారక్కడ? త్యాగం అని చెప్పారా లేదా? మరి మనం ఎందుకు పట్టించుకోవాలి? అందుకే తెలివిలేని అహములతో తెలియరాని బాధలతో కలత చెందు జీవులము మము కనికరించి ఏలుకొనగా - ఈ కలత చెందే జీవులను ఏలుకోవయ్యా! ఎందుకని? ఉపకారమంటే నీదేనయ్యా, ఇంకెవరిదీ కాదు. ఉపకారమంటే అక్కడే ఉన్నది. ఎక్కడ ఉన్నది? తద్వస్తువు నీ దగ్గరే ఉన్నది. తత్పరమైన జీవలక్షణాలు కలిగిన దాని దగ్గర ఉపకారాలు లేవు. అపకారం లేకపోయినా ఉపకారం లేదక్కడ. ఉపకారం కలిగి ఉండాలంటే సహజ భావన సద్భావన ఉండాలి.

ఏనాడో ఎచ్చటనో ఈనాడే పరిసమాప్తి - అంటే చెప్పిపోతున్నారా మనతో? చెప్పినవాడు అసలు వెళ్ళడు. నేను చస్తానేమో, నేను చస్తానేమో ఇంకేముంది అంటారు చాలామంది. బాబూజీ నన్ను రమ్మంటున్నారు, నన్ను తీసుకెళ్ళిపోతున్నారు అనేవాళ్ళు కూడా ఉంటారు కొంతమంది. ఇంకేముంది బాబూజీ నన్ను పిలిచేస్తున్నారు, నేను వెళ్ళిపోతున్నాను అనేవాళ్ళు కూడా ఉంటారు. కాని వెళ్ళరు. కొన్ని సంవత్సరాలుంటారు. ఎప్పుడేమౌతుందో? ఏం

చేస్తాడో బాబు. ఆ శక్తి ఉన్నదే, గురుశక్తి అనేది పరమమైనటువంటిది. అలాగే కర్మశేషం ఇంకా ఉంటే ఆ కర్మ రహితం అయ్యేవరకు చచ్చేదాకా శరీర భ్రాంతి లేకుండ ఉంటాడు. ఎందుకు? ప్రారబ్ధ కర్మ!

జ్ఞాన మొసగి దారి చూపి, దీనులమము దీవింపగ! ఎంత హాయిగా ఉంది! **ప్రభుస్త్వం దీనానాం ఖలు పరమబంధుః పశుపతే, ప్రముఖ్యో హంతేషామపి కిముత బంధుత్వ మనయోః । త్వయైవ క్షంతవ్యాః శివమదపరాధాశ శతవాన్ । ప్రయత్నాత్ కర్తవ్యం మదవనమియం బంధు సరిళం** మన బంధుత్వం ఈనాటిది కాదు. నీవు ప్రభువు. నేను దీనులలోకెల్ల ఆఖరి దీనుణ్ణి నేనే. ప్రభూ! ఈ బంధుత్వం ఈనాటిది కాదయ్యా! చాలా పరంపరగా వస్తూనే ఉన్నది. కాబట్టి నేను చేసే అపరాధాన్ని క్షమించాలంటే, నువ్వే క్షమించాలి ఇంకెవ్వరూ క్షమించలేరు.

**క్షంతవ్యా. శివ మదాపరాధాశ్చ సరలాః** ప్రయతాల్ని కర్తవ్యం - దానికోసం నేను ప్రయత్నం చేస్తున్నా. ఈ బంధుత్వమే నాకు స్థిరమైనది అనే భావన నేను, ప్రయత్నాత్ కర్తవ్యం మదవన మియం బంధూవీ సరళాః. ఇటువంటి బంధు సరళిని గుర్తించటానికి చూడండి మన బంధుత్వం ఎంత గొప్పదో?మనిద్దరి బంధం ఈనాటిదా? ఎన్ని జన్మల నుంచి వస్తోందో? ఆత్మ బంధుత్వం మనది.

భగవంతుడు చెబుతున్నాడు. నాకు తెలుసు అన్నీ. కాని నీకు ఏమీ తెలియదు. అందుకని తెలిసినంతవరకూ పరమాత్మ్మణ్ణి అహర్నిశలూ ప్రతి విషయంలోనూ, మన ప్రతి కదలికలోనూ ఉన్నది ప్రభువు. భక్తి తత్త్వంగా తీసికొంటే ప్రతిదీ నీ దయ అనుకోవటం. జ్ఞానపరంగా తీసికొంటే నీదేనయ్యా!.

సర్వాంతర్యామియైన పరమాత్మలో నేను లేనంటే సర్వాంతర్యామిత్వానికి లోటురావటంలేదా? ఏది కాకుండా పోయిందక్కడ? కాబట్టి శ్రీగురుదేవుల పరిపూర్ణమైన అనుగ్రహం మన ఎడల ఉండబట్టి మనను అక్కున చేర్చుకొని ఇంత స్థానమిచ్చి ఎక్కడకు పోతారురా? ఇక్కడ నా సన్నిధిలో తప్ప మీకు ఎక్కడా గతి లేదని ఆ సన్నిధినే మనకు పెన్నిధిగా ప్రసాదించారు. అట్టి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక!!

# శ్రీ బాబూజీ దివ్యవాణి

## పుణ్య పృథ్వి

భరతమాత భాగ్యవశమున ఈ దేశంలో జన్మించుతూ వచ్చిన మహాత్ముల పరంపరయనెడి మహాసాగరమునందు, లోగడ పేర్కొనిన ఉదాహరణలన్నియు కొలది పాటి ఉదకబిందువులు మాత్రమే. కాని, ఇది దివ్య భూమి యనీ, ఇందలి ప్రతి అణువూ పవిత్రమైనదేయనీ, ప్రతి యాత్రాస్థలమూ ఆధ్యాత్మికోత్తేజనం కలిగింపజేయు మహత్వ సంపన్నమేననీ, ఇచటి మహాత్ముల దివ్యవిజ్ఞానపు తేజఃప్రసారంతోనే ఇచటి వాతావరణమంత నిండివుంటుందనీ అసందిగ్ధంగా నిరూపించుటకు ఈ కొలది ఉదాహరణలు చాలును.

ఈ పరమపావన భూమియందు ఒక్కసారియైననూ జన్మించుట మోక్ష ప్రాప్తికి కడపటి మెట్టుగా ప్రతి హిందువూ సగర్వముగా భావిస్తూ ఉంటాడు. అది సమంజసమే. కాని ఇది అతిశయోక్తితో కూడిన మాటగా కొందరికి తోచవచ్చును. అట్టి వారికి స్పష్టం చేసేది ఏమంటే, చరమముక్తి సాధనం మానవ జన్మ ద్వారానే సాధ్యపడుతుంది గనుక స్వర్గ లోకపు దేవతలు సైతం ఈ పుణ్యభూమియందు జన్మించాలని అభిలషిస్తారని మన శాస్త్రములు చాటుతున్నవి.

ఈ దేశం ఇంతటి దివ్యభూమి యగుటకు ఇచట జన్మించిన మహాత్ములు కారణమా లేక ఇది దివ్యభూమి యగుట వల్లనే ఇందరు మహాత్ములిచ్చట జన్మించినారా, అనే ప్రశ్న పుట్టడం సహజం. పరస్పర ప్రభావ ఫలితంగా దీని యదార్థం ఉభయత్రా కలదని అంగీకరించక తప్పదు. మనదేశపు ప్రాచీన మహత్యాన్ని బొత్తిగా గుర్తించనివారూ, అది అంతా కట్టుకథ క్రింద జమకట్టేవారూ, తాము హిందూ మతానికి చెందిన వారమని చెప్పుకోడానికి సైతం లజ్జపడేవారూ మన దేశంలోనే కొందరుండడం విచారకరమే. తల్లి మహిమను గుర్తించక అవిశ్వాసులై చరించే మంద ప్రజ్ఞులైన కుమారులు కొందరు ఉండడం మూలంగానే

దేశంలో ఈనాడు దుఃఖమూ, దారిద్ర్యమూ, ఎటుచూచినా అయోమయ పరిస్థితులు తాండవిస్తున్నాయి. మహాత్ములయందు ప్రజలకూ విశ్వసంలేకపోవడమే దీని కంతకునూ మూలం.

కపటపు బాబాలూ, మహాత్ములూ దేశంలో కుక్కగొడుగులవలె పెరుగుతూ ఉండడమే ఈ అవిశ్వాసానికి మూలమని ఎవరైనా వాదించ బూనడం వారి వివేకరాహిత్యమును, కర్తవ్య విముఖత్వమునూ వెల్లడించుకోవడమే అవుతుంది. ఏదైనా ఒక వ్యాధితో నీవు బాధపడుతున్నప్పుడు, దానిని పోగొట్టుకొనడానికి సరియైన మందు తీసుకొనే ప్రయత్నం చెయ్యాలి. సరియైన మందు తప్పక ఉండనే ఉంటుంది. మాయమందులు దేశంలో విచ్చలవిడిగా ఉత్పత్తి అవుతున్నవనే కారణంచేత, అసలు ఏమందూ పుచ్చుకోనంటే భగవంతుడు సైతం నీకేమీ తోడ్పడజాలడు.

సరియైన మందును అన్వేషించే ఓపిక గలిగి అట్టిదానిని వివేకంతో గుర్తించ నేర్చి దానిని నమ్మకంతో, తగిన పథ్యపాన సమేతంగా సేవించినప్పుడు, సత్ఫలితములు తప్పకుండా కలుగుతాయి. ఆధ్యాత్మికాభి వృద్ధిని బంధించే వ్యాధిచేత బాధపడేవారి విషయంలో కూడ ఇంతే. తగిన ఆధ్యాత్మికాభివృద్ధిని పొందగలుగుతూ ఆత్మసాక్షాత్కార రూపమైన ముక్తిని పొందడానికి సరియైన మహాత్ముల ఆశ్రయమును సంపాదించటం ఎంతైనా అవసరం.

సంతృప్తి నీయజాలని ఒక ముఖ్య విషయమేమంటే, మానవలోకానికి తోడ్పడే ప్రయత్నాలను మహాత్ములెప్పుడునూ తీవ్రంగా చేస్తూనే ఉంటారు. అవిశ్వాస ప్రాబల్యం వారి ప్రయత్నాలనేమాత్రమూ మందగింపజేయవు. అన్ని అవరోధాలనూ పటాపంచలు చేసి 'సర్వేజనా స్సుఖినోభవంతు'' అనే లక్ష్యసాధనకు నిరంతరమూ కృషి చేస్తూనే ఉంటారు.

ఇదియే, గుంటూరుజిల్లా నంబూరు వద్దగల కాళీగార్డెన్సులో శ్రీ హనుమత్ కాళీ వరప్రసాదబాబూజీ మహరాజ్ వారు హిందూ ధర్మ విశిష్టతను గురించి తమ శిష్యులకు చేసిన ఉద్బోధల సారాంశం. *

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

ఆ మర్నాడే ఊళ్ళో గడ్డివాములు అంటుకొని మండిపోవటం మొదలు పెట్టాయి. వెంకయ్యగారి యింటి చుట్టూ ఉన్న అందరి దొడ్లలోని గడ్డివాములూ తగలబడుతున్నాయి. కాని చిత్రంగా, వెంకయ్యగారి గడ్డివాములకు గాని, పాకకు గాని ఏ హానీ జరుగలేదు.దానితో ఆ గ్రామస్థులందరికీ శ్రీ బాబు మహాత్ములనే గురి కుదిరింది. గ్రామ పెద్దలందరూ శ్రీ బాబు వద్దకు వచ్చి, "యీ గ్రామానికి పట్టిన పీడను తొలగించండి", అని వేడుకున్నారు. శ్రీ బాబు వారికి అభయమిచ్చి కొంత యిసుకను మంత్రించి యిచ్చి, ఆ యిసుకనూ, తమ పూజా తీర్థమునూ గ్రామం చుట్టూ చల్లమని, కొన్ని జపాలు చేయించమని, ఇక ఆ గ్రామం పొలిమేరలకు కూడా ఆ దుష్ట శక్తి ప్రవేశించ లేదని చెప్పారు. గ్రామస్థులు అలా చేశాక, గ్రామానికి ఆ పీడ శాశ్వతంగా తొలగి పోయింది.



వెంకయ్యగారికి సంతానం లేదు. శ్రీ బాబు ఆయనకు గోదీక్షను అనుగ్రహించారు. ఆ దీక్షను శ్రద్ధగా అనుష్ఠించిన ఫలితంగా, వెంకయ్యగారికి మొదట ఆడపిల్ల, తరువాత మగ సంతానము కలిగారు.

గుండుగొలను వాస్తవ్యులైన శ్రీ సాంబశివరావుగారు, శ్రీ సుబ్బారావుగారు, పాతూరు వచ్చినప్పుడు, వాళ్ళకు శ్రీ బాబును గూర్చిన విశేషాలు తెలిసాయి. వారి మూలంగానే శ్రీ బాబు గుండుగొలను గ్రామానికి మొదటిసారిగా రావటం జరిగింది. శ్రీ మహాదేవుని కోటంరాజుగారు, చైర్మన్ వెంకట రాజుగారు, శ్రీ బాబును గుండుగొలనుకు ఆహ్వానించారు. వారింట్లోనే శ్రీ కొండ గోపాలరాజుగారు (పూజ్యశ్రీ మాతాజీ వారి మేనమామ) శ్రీ బాబూజీని దర్శించి, అక్కడి నుండి తమ యింటికి తీసుకొని వెళ్ళారు.

ఇది సుమారు 1946వ సం॥లో జరిగింది. ఆ తరువాత శ్రీ బాబు గుండుగొలను వచ్చినప్పుడు గోపాలరాజు గారింట్లోనే తమ దేవతార్చనతో

సహా ఉండేవారు. వారింట్లోనే శ్రీ బాబు 1948వ సం॥లో శ్రీ దేవీ శరన్నవరాత్రి పూజలు జరిపారు.

శ్రీ బాబును దాసుగారని, సిద్ధాంతిగారని, కోమటి సాధువు గారని, కాళీ బాబు గారని జనం పిలుస్తూ ఉండేవారు. తమ తమ కష్ట సుఖాలు చెప్పుకోవడానికి, బాధా నివారణకు, తదితర కోరికలు ఎన్నిటితోనో, ఎందరెందరో శ్రీ బాబు వద్దకు వచ్చేవారు. శ్రీ బాబు ఓపికగా, ఎంతో దయతో వారందరి విజ్ఞప్తులను విని, తగు సూచనలిచ్చి తృప్తి పరచి మరీ పంపేవారు.

గుండుగొలనులో ఎంతో సాధన పరులై , నిరాడంబరులైన కొవ్వూరు సాధువుగారనే స్వాములవారు ఉండేవారు. శ్రీ బాబు యెడల ఆయనకు అపార గౌరవము, భక్తీ ఉండేవి. శ్రీ బాబు కూడా వారిని ఎంతో ప్రేమతో సగౌరవంగా చూసి ఆదరించేవారు.

శ్రీ బాబు యెడల ఎంతో మందిలో భక్తి విశ్వాసాలు నెలకొన్నట్లుగానే, మరి కొందరిలో విమర్శనా దృష్టి , చులకన భావము, వారి వారి సంస్కారాలను బట్టి ఏర్పడుతూ ఉండేవి. ఆ గ్రామము ఎందరో కులీనులు, స్వాభిమాన ధనులు, మహా సంపన్నులు అయిన సుక్షత్రియులతోనూ, శాస్త్ర పండితులైన బ్రాహ్మణులతోనూ విలసిల్లే గ్రామం. స్వాభిమానం ఒకింత దురభిమానంగా మారి మీసాలు మెలివేసే వారూ, కత్తులు దూసే వారూ కూడా ఉండేవారు. శ్రీ బాబు అప్పటికింకా నూనూగు మీసాలు కూడా రాని బాలుని వలె వారి కళ్ళకు కనిపించేవారు. వారి మాటలు కూడా నంగిగానూ ముద్దగానూ అస్పష్టంగానూ ఉండేవి. శాస్త్ర వాసన కూడా ఏమీ తగిలేది కాదు. అందువలన మొదట్లో వారందరూ యీ 'కుర్రవాని సామర్థ్య మెంత లె' మ్మని, 'యిలా ప్రశ్నలు చెబుతూనో, విభూతులూ, తాయెత్తులూ యిస్తూనో, మంత్రాలు వేస్తూనో పొట్టపోసుకొనే వారిని ఎంత మందినో చూశాము లె' మ్మని నిర్లక్ష్యంగానూ, తిరస్కార భావంతోనూ ఉండేవారు.

శ్రీ బాబూజీ మాత్రం తమ వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరిని, బాలుని మొదలు వయో వృద్ధుల వరకు, కుల మత విచక్షణ లేకుండా ప్రేమతో పలకరించి, ఆత్మీయులుగా ఆదరించి, "తమరు" అంటూ మన్ననతో సంబోధించి సంభాషించే వారు. కాని వారి చరిత్రలన్నీ శ్రీ బాబు కనుల యెదుట సినిమా రీలు వలె తిరుగుతూ స్పష్టంగా కనిపించేవి.

-సశేషం

# అమెరికాలో శ్రీ మాతాజీ

-పద్మజ U.S.A

శ్రీమాతాజీ భక్తులను ఉద్దేశించి బోధచేస్తూ మన మనస్సు ఎంత పొందినా తృప్తి చెందుతోందా? మనము కడుపు నిండా తింటున్నాము. కావలసినంత ధనాన్ని సంపాదిస్తున్నాము. సుఖంగా నిదురపోతున్నాము. కాని దానివలన ఏమన్నా ప్రయోజనం పొందుతున్నామా? 'నిధిసుఖమా? రాముని సన్నిధి సుఖమా,' అనే ప్రశ్న మన జీవితంలో వేసుకుంటున్నామా?

మన నిజస్థితిని గుర్తించకుండానే జీవితం వెళ్ళిపోతుంది. ఎవరికీ భయాన్ని దుఃఖాన్ని కలిగించనివాడు నాకు అందరికంటే ప్రియుడు అని భగవానుడు స్వయంగా శెలవిచ్చాడు కదా! మహాత్ములు వస్తున్నారు, వెళ్ళిపోతున్నారు. మహాత్ములు బోధచేసే మంచిమంచి మాటలను శ్రవణం చేయవచ్చు. అవి మన జీవితాన్ని మంచి మార్గంలో నడిపిస్తాయి.

మనస్సు, బుద్ధి, భగవానుడి యందు లయం చేసినవాడు ఆయనకి భిన్నంగా ఉంటాడా? ప్రపంచంలో ఏ పనిచేసినా మంచిగాని, చెడుగాని కర్తృత్వము వహించినవాడు, కార్యం ఆచరించినవాడు, దాన్ని ప్రేరేపించివాడు, ఆమోదించినవాడు అందరూ దాని ఫలితాన్ని పంచుకోవలసినదే.

మాటలతో మానవుని మనస్సును నొప్పించరాదు. అది హింసక్రింద పరిగణింపబడుతుంది. ఎవరైనా సాధకులు పోనీ కష్టాలలో ఉన్నారని దాని ఉపశమనానికి ఏదైనా దీక్ష చేయమని చెపితే ఆ దీక్ష నన్నే చేయమంటారు.

గురుదేవుని ముఖకమలం నుండి వచ్చిన బోధని శ్రవణం చేసి, మనస్సులో పదిలపరచుకొని, ధ్యానంలో మననం చేసుకుని, ఆయన పాద కమలం నుండి మకరందాన్ని జుర్రుకున్నవాడు ధన్యుడు.

భగవంతుడు అవ్యక్తంగా ఉన్నా ఆయని ప్రేమని అందజేస్తూనే ఉన్నాడు. కాని మనం విషయాదులతో నింపుకున్న మనస్సుని అడ్డుపెట్టుకొని, దానిని అందుకోలేక సదవకాశాన్ని, దుర్వినియోగ పరచుకుంటున్నాము.

భగవానుడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు అని విశ్వసించిన సాధకుడు సుఖము కలిగితే పొంగిపోయి, దుఃఖం కలిగితే క్రుంగిపోవలసిన పని ఏమున్నది? ప్రపంచంలో అందరినీ బ్రతిమిలాడి,

భంగపడి, అవసరమైతే కాళ్ళు పట్టుకుని ఎన్నో పనులు సాధించుకో గలుగుతున్నారు కదా. నీ మనస్సుని బ్రతిమిలాడి, నీకు సానుకూలంగా మరల్చుకుంటే సమస్యలు ఉండవుకదా!

యాచన చేసి వచ్చిన సొమ్ముతో ఇంటి ఖర్చుని గడుపుకుంటూ అతిథులను ఆదరించుతూ కాలం గడిపిన మహాత్ముడు త్యాగరాజు. 'నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సుఖమా,' అని ప్రశ్నించుకుని రాముని అంగీకారం కాదని మహారాజుగారు పంపిన కానుకలను తిరస్కరించాడు. శ్రీరామచంద్రుడు ఆయనకి ఏమన్నా లోటు చేసాడా! వాచా వేదాంతంకాదు కావలసినది ఆచరణలో చూపించాలి అన్నారు మాతాజీ.

## ఆహ్వానము

## పంచాహ్నిక శ్రీసద్గురు చండీ రుద్ర యాగము

శ్రీశ్రీశ్రీ సమర్థసద్గురుహనుమత్కాళీవరప్రసాదబాబూజీ మహరాజ్‌వారి దివ్య ఆశీస్సులతో, శ్రీమాతాజీవారి అనుగ్రహ పర్యవేక్షణలో......

సత్సంగసమావేశములు, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము, పంచాహ్నిక అఖండ హరినామ సంకీర్తన, సామూహిక సూర్యనారాయణ మూర్తి పూజలు, రుద్రాభిషేకాలు, మరియు కుంకుమ పూజలు

*ది. 5-2-2011 నుండి 9-2-2011 వరకు జరుగును.*

**వేదిక**

పాలూరివారి స్థలం, ఫైర్‌స్టేషన్ వద్ద, జి.యన్.టి. రోడ్డు, తుని

వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం......

98481 90362 94412 38818

93465 35357 93983 34345

ఇట్లు
శ్రీబాబూ భక్తసమాజ్
తుని, తూర్పుగోదావరి జిల్లా

## జగన్మాతని దర్శించ శక్యమా!

శ్రీబాబూజీ మహరాజ్‌వారిని ఇదే ప్రశ్నవేసిన భక్తులు అనేకమంది. అంతేకాదు మీరు దర్శించిన జగజ్జననిని మాకు కూడ దర్శింపజేయండి అని అడిగిన వారున్నారు. సద్గురు మూర్తితో తరచు తత్త్వవిషయాలను గూర్చి చర్చిస్తూ అప్పుడప్పుడు వాదనలోకి దిగిన భక్తులలో శ్రీచలపతిగారు, రాజుగారు, శక్తీశ్వరరావు అను ముగ్గురిలో శక్తీశ్వరరావు చేసేవాదన హేతువాదానికి సమీపంగా ఉండేది. శ్రీశంకర భగవత్పాదులవారు చెప్పినట్లు...............

**సర్వేశం సచ్చిదాత్మానం జ్ఞానచక్షుర్నిరీక్షతే ।**
**అజ్ఞాన చక్షుర్నేక్షేత భాస్వన్తం భానుమందవీత్ ॥**

సర్వవ్యాపకమగు సచ్చితానందుని జ్ఞాననేత్రముతోనే దర్శింప సాధ్యపడుతుంది గాని చర్మచక్షువులతో సాధ్యపడదుకదా! ఎంతో ప్రకాశంతో సూర్యభగవానుడు ప్రకాశిస్తున్నా గుడ్డివాడు వీక్షించలేడుకదా! భగవానుడు మా కంటికి గోచరించటం లేదు కాబట్టి ఆయన లేడని వాదించటం కేవలం అజ్ఞానమే. దేనికైనా సమయం రావాలి కదా! అజ్ఞానాంధకారము ఉన్న మూర్ఖులు ఎంత వాదించినా మహాత్ములు సంయమనము పాటించి సమయం వచ్చినప్పుడు వారికి కనువిప్పు కలిగిస్తారు.

ఒకనాటి సాయం సమయం శ్రీచలపతి, రాజుగారు, శక్తీశ్వరరావు గార్లను శ్రీబాబూజీమహరాజ్ వ్యాహ్యాళికి తీసికెళ్ళారు. శక్తీశ్వరరావు వాదనకి దిగాడు. అమ్మవారిని ఎవరైనా దర్శించారంటే నమ్మదగిన విషయంకాదు. అదంతా వారి ఊహ మాత్రమే అంటూ మాటలు కొనసాగిస్తున్నాడు. శ్రీబాబూజీ మౌనంగా వారితోపాటు నడక సాగిస్తున్నారు.

సూర్యాస్తమయం అయిపోయింది. మసక చీకటిగా ఉంది. ఊరు చివరికి చేరుకున్నారు. అక్కడ పెద్ద జలాశయం ఉంది. జనం రాకపోక లేదు. విద్యుద్దీపాలు కూడా లేవు. ఇంతలో శక్తీశ్వరరావు ప్రక్కనే నడుస్తున్న చలపతిగారు, రాజుగారు అదృశ్యమయ్యారు.

అది అకస్మాత్తు పరిణామం. శక్తీశ్వరరావు ప్రక్కన బాబూజీ ఒక్కరే ఉన్నారు. ఆయన కొంచెం కంగారుపడ్డారు. భయం భయంగా మాట్లాడుతూ 'బాబూ! వీరిద్దరూ ఏరి,' అని అడిగాడు. శ్రీబాబూజీ సమాధానం చెబుతూ

'నేను ప్రక్కనే ఉన్నాను కదా! నీ వాదన వింటూనే ఉన్నాను. నీకు భయం ఎందుకు,' అని హామీ ఇచ్చారు.

"ఏమిటయ్యా! ఎవరో తెలివితక్కువ వాళ్ళు మాట్లాడిన మాటలు పట్టుకుని అమ్మవారు ఎక్కడుంది? ఎవరైనా దర్శించారా? అంతనమ్మదగిన విషయం కాదు," అని వాదిస్తావు అని అంటూ మాట పూర్తికాకముందే చెరువులో నుంచి పెద్ద శబ్దం, మెరుపు మెరిసింది. మరుక్షణం శ్రీబాబు అదృశ్యం అయ్యారు. శక్తీశ్వరరావు ఒక్కడే ఉన్నాడు. భయం భయంగా వణికిపోతున్నాడు.

చెరువులో అతనికి కనిపించిన దృశ్యంతో బాబూ! బాబూ! అంటూ అపస్మారక స్థితిలో క్రిందపడిపోయాడు. చెయ్యిపట్టుకు చూస్తే కాలిపోతోంది. జ్వరం తీవ్రంగా ఉంది. చలపతిగారు, రాజుగారు ప్రక్కనే ఉన్నారు. కాని ఇంతవరకు జరిగిన సంగతులు వారికి తెలియవు. వారిద్దరూ,' ఏమైంది ఇతనికి,'అని బాబూజీని ప్రశ్నించటం మినహా వారికేమీ తెలియదు.

శ్రీబాబూజీ మాట్లాడుతూ, "నాకు మాత్రం ఏమి తెలుసయ్యా! నేనూ మీతోనే ఉన్నాను కదా! వెంటనే ఆసుపత్రికి తీసికెళ్ళండి. స్వస్థత చేకూరిన తరువాత ఏం జరిగిందో అతనే చెపుతాడు," అన్నారు.

అక్కడే ఉన్న చలపతిగారిని ఉద్దేశించి, "ఏం చెప్పాడు శక్తీశ్వరరావు," అని అడిగారు. చలపతిగారు మాట్లాడుతూ శక్తీశ్వరరావు కాళీమాత ఉగ్రరూపాన్ని చూసి భయపడిపోయాడు తరువాత ఏం జరిగిందో తెలియదన్నాడు.

శ్రీబాబూజీ బోధ చేస్తూ, "భగవద్దర్శనం పొందాలంటే అనన్య భక్తితో సద్గురుమూర్తిని ఆశ్రయించి, సేవించి గుణరహితమైనప్పుడే సాధ్యపడుతుంది. అర్జునుడు కూడా శ్రీకృష్ణపరమాత్మ పరమానుగ్రహంతో ప్రసాదించిన దివ్యదృష్టితోనే కదా విశ్వరూప దర్శనం పొందగలిగినది," అన్నారు. *

# మన సాధన ఎందుకు ఫలించటం లేదు?

(గత సంచిక తరువాయి) -వెంకట రమణ ప్రసాద్

అంత అచ్చుటివారెల్లరూ రామానుజులవారి కడకేగి 'దాశరధిగారి దాస్యము మాన్పింపు' మని వారిని ప్రార్థించిరి. శ్రీరామానుజులును దాశరథికి గల మూడుమదములను వారిని విడచినవని తెలుసుకొని, దాశరధిని దాస్య విముక్తులుగా చేసి వారికి చరమ శ్లోకార్థమును బోధించిరి.

ఆభిజాత్య, విద్యా, ధన మదములుకల వారికెన్నటికిని తత్వజ్ఞాన మంటదు. కనుక సాధకులైనవారు నిజముగా మోక్షకాములే యైనచో ఈ త్రివిధ మదములను మొదట జయింపవలెను. ఇంకను ఇటువంటి ప్రతి బంధములను గురించి శాస్త్ర మేమి తెలియజేయునో తెలుసుకుందము.

వేదాంతమున నెంత కృషిచేసినను, ఉపవాసాది కఠిన నియమము లెంత పాటించిననూ, ఒక్కొకపుడు సాధకుడు కృతకృత్యుడు కాలేక పోవుచున్నాడు. "దీనికి కారణమేమి?" యని ప్రశ్నించి శ్రీవిద్యారణ్యులు, సాధకులను శ్రీసురేశ్వరులు తమ వార్తికములో హెచ్చరించిన త్రివిధ ప్రతి బంధముల నుండి మొదట విముక్తులు కావలెనని నిర్ణయించిరి.

అసావపి చ భూతోవా, భావీవా, వర్తతేzధవా కుస్త జ్ఞానమితిచేత్తద్ధి బంధపరిక్షయాత్ అని చెప్పిరి. ప్రతిబంధములు నివర్తింపనిదే బ్రహ్మ సాక్షాత్కారము కలుగదు. ప్రతిబంధములు........

1. భావిప్రతిబంధము 2. భూతప్రతిబంధము 3. వర్తమాన ప్రతిబంధము అని మూడు విధములని సురేశ్వరులు నిర్ణయించిరి. మన సాధనకు అడ్డుపడు యీ త్రివిధ ప్రతిబంధములు నశించినగాని, మనకు మోక్షమబ్బదని శ్రీవిద్యారణ్యులు తమ పంచదశిలో వివరించిరి (వేదాంత పంచదశి, 9-40, 41) "వేదవేదాంతములు తెలిసినను, ప్రతిబంధములు క్షయింపనిది బ్రహ్మజ్ఞానము కలుగదు. బంగారు పాతరపై కాపురమున్న వాడుకూడా తనకా బంగారము కనబడకుండ జేయునట్టి యిటుకలు మొదలగు వాని యడ్డము తీసివేయనంతవరకు సువర్ణలాభము నెట్లు పొందలేడో , అట్లే శాస్త్రజ్ఞానమును సంపాదించినను సాధకుడు ప్రతిబంధత్రయమును దాటనంతవరకు బ్రహ్మసాక్షాత్కారమును

పొందలేరు"డని విద్యారణ్యుల నిర్ణయము. ఇప్పుడు మన సాధనకడ్డుపడు నీ ప్రతిబంధత్రయమును గూర్చి విచారించెదము.

### 1. భావిప్రతిబంధము

దీనినే కొందరు ఆగామి ప్రతిబంధమనియు పలికెదరు. అనగా ఈ జన్మలో చేసిన కర్మమునకు ముందురాబోవు జన్మలలో అనుభవించవలసిన ఫలితమని యర్థము. దీనికి అందరకు బాగుగా తెలిసిన జడభరతుని కథ యొక మంచి యుదాహరణము. తల్లి చనిపోయిన లేడికూనపై జాలితో జడభరతుడు దానిని తన యాశ్రమమునకు తెచ్చి పెంచదొడంగెను. కొంతకాలమునకు దానియందనురాగము కల్గెను. ఆ యనురాగముగాఢమై మమకారముగా మారెను. ఆ మమకారము వలన తరువాత జన్మలో నాతనికి లేడి జన్మ కలిగెను. సాధకుడు దీనిని గుర్తించి తనకు భవిష్యత్తులో మమకారమునకు పాలుజేయు వస్తు సంపర్కమునకు దూరముగ నుండవలెననునది జడభరతుని కథలోని నీతి.

### 2. భూత ప్రతిబంధము

మనము పూర్వమొనర్చిన కార్యములన్నియు ధ్యాన సమయమున మన మనస్సులోనికి ప్రవేశించి ఏకాగ్రత కలుగనీయక అడ్డుపడును. సాధారణమైన ఆలోచనలు, జీవన విధానములు మాత్రమే గాక, వస్తువులతో, మనకు ప్రస్తుతమున్న సంబంధము కూడ నొక గొప్ప ప్రతిబంధకమగును. ఈ సందర్భమున శ్రీవిద్యారణ్యులు తమ పంచదశిలో తాను పెంచిన గేదెపై మమకారము పెంచుకొన్న శిష్యుడు, ఏ విధముగా సద్గురువుచే రక్షింపబడెనో యొక కథగా చెప్పబడినది.

**అతీతే నాపి మహిషీ స్నేహేన ప్రతిబంధితః**
**భిక్షుస్తత్త్వం న వేదేతి గాధా లోకే ప్రతీయతే** (9-4)

ఒక శిష్యుడు తన గృహస్థాశ్రమమునందు ఒక గేదెను పెంచెను. దాని యందు విశేష మమకారమును పెంచుకొనెను. కొంత కాలమునకు అతడు సన్యసించెను. సన్యసించిన తరువాత నాతడు గురుబోధను విని ధ్యానమును చేయ మొదలిడెను. కాని ఎన్నిసార్లు బ్రహ్మచింతనమునకు ప్రయత్నించినను, అన్ని పర్యాయములును పూర్వవాసనవలన ఆ గేదె రూపమే అతనికి దృష్టిగోచర మగుచుండెను.

-సశేషం

# తిరు నీలకంఠ నాయనార్

ఆంగ్లమూలం- ఆర్. సంపత్,     తెలుగు అనువాదం - సుషుమ్నా ప్రసాద

తమిళనాడులో ఆలయ నగరంగా ప్రసిద్ధి చెందిన చిదంబరమందు శ్రీనటరాజస్వామి అను గొప్ప భక్తుడు నివసించేవాడు. ఆయన క్షీరసాగర మధన సమయమున విశ్వము ప్రళయం కాకుండ సంరక్షించటానికి హాలాహలమును తన కంఠమున నిలుపుకొని నీలకంఠునిగా ప్రసిద్ధి చెందిన పరమేశ్వరుని కథనాన్ని విని ఉప్పొంగిపోయి నిరంతరము నీలకంఠ యనే పవిత్ర నామాన్ని స్మరించేవాడు. అతను నిరంతరము యితరులతో సంభాషించేటప్పుడు 'తిరునీలకంఠ' స్మరణ చేసేవాడు. అందువలన భక్తులందరూ ఆయన్ని 'తిరునీలకంఠార్' అని పిలవటం ప్రారంభించారు.

కుండలు తయారు చేసే కుమ్మరి వృత్తికి చెందిన 'తిరునీలకంఠార్' చాలా పొదుపుగా, ఆనందంగా జీవనాన్ని కొనసాగిస్తూ తమకొచ్చే ఆదాయంలో కొంత శివాలయమునకొచ్చే శివభక్తుల ఆతిథ్యానికి ఉపయోగించేవారు. అంతేకాక మట్టితో పాత్రలు తయారుచేసి, వాటిని భక్తులకు పంచిపెట్టేవారు.

ఒకమారు ఆయన వ్యాపారరీత్యా దగ్గరలో ఉన్న ప్రాంతానికి వెళ్ళి అక్కడ కొంతకాలం నివసించవలసి వచ్చింది. ఆ తరుణంలో ఆయన అక్కడ ఉన్న ఒక వేశ్య ఆకర్షణకు లోనై ఆమెతో బంధం ఏర్పరచుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చిన తరువాత తననెంతో శ్రద్ధాభక్తులతో సేవించే భార్యకు అపరాధం చేసినట్లు భావించి, సిగ్గుపడి, ఆమెకు తాను చేసిన అన్యాయాన్ని అపరాధాన్ని వివరించాడు.

కాని ఆమె తిరునీలకంఠార్‌ను ఒక్క పరుషమైన మాటగాని, విముఖతనుగానీ, వ్యక్తీకరించక పూర్వంలాగానే ఆయన్ను సేవిస్తున్నది. ఆయన తన భార్య తనను క్షమించిందనుకొన్నాడు. ఒక రాత్రి తన ధర్మపత్ని నిద్రిస్తుండగా, ఆమెను సమీపించి, స్పృశించబోయాడు. వెంటనే ఆమె చివుక్కున పిడుగు పడ్డట్లుగా లేచి, 'తిరునీలకంఠం మమ్ములను స్పృశించవద్ద'ని గట్టిగా అరిచింది. భగవంతుని పేరుతో ఆమె వేసిన కేకకు నిర్విణ్ణుడై తిరునీలకంఠారు ఆమె ప్రయోగించిన 'మమ్ములను' అనే బహువచనాన్ని అవగాహన చేసుకొని, ఇకపై ఏ స్త్రీని స్పృశించ కూడదనే

నిర్ణయం తీసుకున్నాడు. భార్యా భర్తల మధ్య వచ్చిన యీ ఎడబాటు చిదంబరంలో మరెవరికీ తెలియదు.

కాని తన భక్తులిలా ఎడబాటుకు గురికావటం భగవంతుడు సహిస్తాడా? ఒకరోజు నటరాజస్వామి తిరునీలకంఠారుకు ఒక ఋషివేషంలో దర్శనమిస్తాడు. ఆయన ఒక పాత్రను అందజేస్తూ, "నేను తీర్థయాత్రలకు వెడుతున్నాను. భగవంతుడు నాకు ప్రసాదించిన ఈ పాత్రను ఈ సుదీర్ఘయాత్రలో ఎక్కడైనా పోగొట్టుకుంటానేమో అని భయంగా ఉంది. అందుచేత ఈ మూకుడును నేను తిరిగివచ్చేదాకా భద్రపరచి ఉంచ,"మని చెప్పాడు. ఆ భక్తుడందుకు అంగీకరించి, ఆ పాత్రను ఒక పెట్టెలో పెట్టి పదిలపరచాడు.

ఒక సంవత్సరం తరువాత ఆ మహనీయుడు తిరిగి వచ్చి, తన పాత్రను తిరిగి ఇవ్వమన్నాడు. తిరునీలకంఠార్ ఆ మూకుడును తేవటానికి లోపలికి వెళ్ళాడు. కానీ ఆ మూకుడు పెట్టెలో కనబడక భయభ్రాంతు డయ్యాడు. ఇల్లంతా ఎంతో శ్రమపడి వెతికాడు. కాని పాత్ర అదృశ్యమైంది. వేచి ఉన్న ఋషికి పాత్ర కనబడలేదని భయవిహ్వలుడై చెప్పాడు. ఆ పాత్ర పోయినందుకు బంగారు మూకుడును తయారు చేయించి ఇస్తానని విన్నవించుకున్నాడు.

ఆ ఋషికి చాలా కోపం వచ్చింది. "స్వర్ణపాత్రతో భిక్షాటనకు వెళితే ప్రజలు నన్ను హేళన చేస్తారు. నీవు నన్ను మోసం చేశావు. భగవంతుడు బహూకరించిన పాత్ర అని చెప్పినందుకు దానిని దొంగిలించి, ఏమీ ఎరుగనట్లు నటిస్తున్నావు. ఈ ఊరి పెద్దలను పిలిపించి, న్యాయం కోరుతాను," అన్నాడు. అలా అంటూ ఆ మునిపుంగవుడు దేవాలయం బయట నిలబడి ఉన్న కొంతమంది పెద్దలను వారికి తిరునీలకంఠార్ చేసిన మోసాన్ని వివరించాడు.

తిరునీలకంఠార్ సాధుస్వభావము తెలిసిన ఊరి పెద్దలు అతని సమాధానమును కోరారు. ఆ భక్తుడు, "నీలకంఠ స్వామిపై ప్రమాణము చేసి నేను చెప్తున్నాను. ఆ పాత్రను భద్రంగా పెట్టెలో పెట్టి దాచాను. మరల మహర్షి వచ్చేదాకా నేనా పెట్టెను తెరవనే లేదు. ఆ పాత్ర ఎలా అదృశ్యమైందో నాకే అంతు పట్టటం లేదు," అన్నాడు. ఆ ఊరి పెద్దలు, "నీలకంఠార్ భక్తుడు, అబద్ధం ఆడడు, కావున దానికి బదులుగా ఆ భక్తుడిచ్చే

స్వర్ణపాత్రను స్వీకరించ,"మన్నారు. అలాగయితే నీలకంఠార్ పుత్రుని దేవాలయపు కోనేరులో స్నానము చేయించి అతని శిరస్సున చేయి ఉంచి, ఆ పాత్రపోయిందని ప్రమాణం చేయమన్నాడు.

పెద్దలు ఆయన చెప్పింది సమంజసంగా ఉన్నదనుకొని నీలకంఠారును ఆ నిబంధనకు ఒప్పుకోమన్నారు. అందులకా భక్తుడు "అయ్యా! నేనెలా ఒప్పుకోగలను? నాకు సంతానమే లేదు" అన్నాడు. అలాగైతే నీలకంఠారు భార్యచేత ఆలయకోనేరులో స్నానం చేయించి, ఆమె శిరస్సు మీద చేయి ఉంచి ప్రమాణం చేయమ'న్నాడు.

ఈ క్లిష్టపరిస్థితుల్లో కలవరపడ్డ తిరునీలకంఠార్ తమ దంపతుల మధ్య వచ్చిన యెడబాటును దాచి లాభం లేదని , అశ్రుపూరిత నేత్రాలతో తమ విషాద గాధను వివరించాడు. ఆ గాధను విని పెద్దల హృదయాలు ద్రవించాయి.

మహర్షి మాత్రం 'భార్య భర్తలిద్దరూ ఒక కఱ్ఱను పట్టుకొని తటాక స్నానం చేసి, కఱ్ఱ పట్టుకొని పాత్రపోయిందని ప్రమాణం చేయమన్నాడు. మహర్షి చూపించిన కృపకు సంతసించి, ఆ దంపతులిరువురూ స్నానమునకు ఉపక్రమించారు.

కాని వారు తటాకంలో మునిగి లేచేటప్పటికి, ప్రేక్షకులకు అమితాశ్చర్యంగా దంపతులిరువురూ ఒకరిచేయి మరొకరు పట్టుకొనిలేచారు. ఒక్క తృటిలో మహర్షి, కఱ్ఱ అదృశ్యమైపోయారు. ఆ దంపతులిరువురూ తరుణ ప్రాయంలోకి వచ్చి, వారి శిరస్సులపై గులాబిరేకుల వర్షం కురిసింది.

అక్కడందరికీ అద్భుతంగా పార్వతీపరమేశ్వరులిరువురూ గగనమందు ప్రత్యక్షమై 'తిరునీలకంఠారు భక్తిని ప్రకటించటానికి మేమాడిన లీల' అని సెలవిచ్చారు.

ఆది దంపతులైన పార్వతీపరమేశ్వరులు ఆ పునీత దంపతులు నీలకంఠారు, ఆయను భార్యను అన్యోన్యంగా జీవించి ప్రజాసేవ చేసుకొని, వారి జీవితాలకు పరమార్థం సాధించి తగిన సమయంలో పరమేశ్వరునిలో లయమవుతారని అభయమిచ్చి అదృశ్యమయ్యారు. *




(గత సంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

"శాశ్వతమా? శాశ్వతత్వం శాపం అవుతుంది. వరదానం కాదు... ప్రకృతి ఆ శాపం నుంచి ముక్తి పొందింది అనుకుందాం," అన్నాడు ఉద్ధవుడు.

అక్రూరుడు గంభీరముద్ర దాల్చాడు. కాళిందీ విశాల సరోవరానికి చేరే వరకు ఏమీ మాట్లాడలేదు! యమునా ప్రవాహం చీకట్లను చీల్చుకొని ప్రకాశంలోకి వస్తోంది. సరోవర తీరంలో అక్కడక్కడ తాబేళ్ళు నల్లని శిలల్లా భాసిస్తున్నాయి. కొంచెం దూరంలో కొన్ని ఆవులు నిద్ర నుంచి మేల్కొంటున్నాయి. వాటి మెడలోని గంటలు ప్రాతఃకాలాగమనానికి సూచనగా మ్రోగుతున్నాయి.... ఈ నీరవత ఏదో వ్యక్తం చేయాలనుకుంటోంది. ఈ తటంపైన అశ్వత్థ వృక్షం క్రింద మయూరం కీచుగా అరిచింది.... తన రెక్కలను విదిలించింది... తిరిగి ముడుచుకుంది. ఒక నెమలి పింఛం దాని నుండి విడివడి భూమిపై రాలింది.

అక్రూరుడు ఆగాడు.... వణుకుతున్న ఆ నెమలివైపు వెళ్ళాడు... అతనిని చూచి ఆ నెమలి పారిపోలేదు... ఉద్ధవుడు ఆశ్చర్యంతో చూస్తున్నాడు. అక్రూరుడు అతికష్టంతో వంగి ఆ నెమలి పింఛాన్ని తీసుకున్నాడు. నెమలి మళ్ళీ కీచుగా అరిచింది. అక్రూరుని ముఖం విప్పారింది. ఉల్లాసంగా అన్నాడు "ఉద్ధవా ప్రతిఒక్క నెమలిపింఛం కృష్ణుడు ఎందుకు అవదు? కాళిందిలో ప్రతి జలబిందువు కృష్ణుడు ఎందుకు అవదు?... బృందావనంలో వీచే ఈ గాలి కృష్ణుని స్పృశించే ఉంటుంది...

ఈ భూమిమీద కూడా కృష్ణుని పద చిహ్నాలు అంకితమై ఉండి ఉంటాయి... "అక్రూరుడు భావావేశంతో అంటున్నాడు. "అయ్యా!" ఉద్ధవుడు అక్రూరుని సంబోధిస్తూ పిలిచాడు. కాని అక్రూరుడు వినే స్థితిలో లేడు... "ఆ ధేనువు కళ్ళు చూశావా ఉద్ధవా? దాని మెడలో కట్టిన గంటల శబ్దాలు విన్నావా?... ఆ వృక్షాల మధ్యనుంచి వచ్చే కాంతి రేఖలను గమనించావా? వాటిలో కృష్ణుని మనోహర రూపం...?" "అయ్యా అక్రూరా! మీరు స్వస్థత పొందండి....

బ్రహ్మముహూర్తం దాటిపోతోంది. కాళింది ప్రవాహం వేచి ఉంది. రండి స్నానం చేద్దాం..." ఉద్ధవుడు అక్రూరుని భావసమాధి నుండి జాగృతం చేస్తూ అన్నాడు. వారు ప్రవాహం దగ్గరకు వచ్చేశారు. ఎక్కడో దూరం నుంచి యజ్ఞవేది నుంచి ధూమవలయాలు విచిత్ర ఆకృతులు చేస్తూ ఆకాశంలో విలీనమవుతున్నాయి. చల్లటి నీటిలో అడుగిడగానే నీటి కెరటాలు వేగంగా లేచాయి.... కొన్ని తాబేళ్ళు అటూ ఇటూ కదిలాయి. చేపలు దూరంగా వెళ్ళిపోయాయి.

అక్రూరుడు నడుము వరకు నీటిలో నుంచుని ఉన్నాడు. అంజలి ఘటించి తూర్పుదిశగా అర్ఘ్యదానం ఇచ్చి వెంటనే ఉద్ధవుని వైపు చూశాడు! కొంచెం దూరంగా ఆయన కూడా అర్ఘ్యదానం చేస్తూ కనిపించాడు. "ఉద్ధవా!.. వసుదేవుడు నాకు సన్నిహితుడు, నా సమవయస్కుడు... కాని ఆయనకు లభించిన సౌభాగ్యం నాకు లభించలేదు..." "ఎటువంటి సౌభాగ్యం మహాశయా? కృష్ణునికి తండ్రి కావటమా?"

"కాదు... కృష్ణుడు వసుదేవునికి పుత్రుడు కావటం నియతి యొక్క పరిణామం మాత్రమే! కృష్ణుడు ఒక వసుదేవునికే కాదు... ఆయన సమస్త సృష్టికి చెందినవాడు ఉద్ధవా!"అయితే ఏమిటి?" కృష్ణ విహీన విశ్వం నుంచి వసుదేవుడు ముక్తిని పొందాడు. శ్వాసను నిరోధించి యోగసమాధిస్థుడైనాడు..... ఏదిశగా కృష్ణుని పద చిహ్నాలు అంకితమైనాయో ఆ దిశవైపు వసుదేవుడు ప్రయాణం చేశాడు...." ఆయన మాటలు తటస్థంగా ఉండి ఎవరికో చెప్తున్నట్లుగా ఉన్నాయి. ముక్తి మార్గం అందరికి ఒకేలాగ ఉండదు. ఈ ప్రకృతి క్రమం ఉద్ధవునికి తెలియనిది కాదు! ఉద్ధవుడు జలప్రవాహంలో చేతులు చాచి అన్నాడు, "ప్రత్యేక దేహికి ముక్తి సంచిత కర్మల ఫలం..."

"నువ్వు నిజం చెప్పావు వత్సా!" అక్రూరుడు ఇంకా ఇలా అన్నాడు "నా సంచిత కర్మ నన్ను యోగ సమాధిలో ముక్తిని పొందనివ్వదు. కృష్ణుని నేను పెట్టిన యాతలలో కించిత్తు కూడా నాకు కలిగించకుండా చూశాడు! యజ్ఞముల పుణ్యం నాకు లభింప చేశాడు, దొంగతనాన్ని మౌనంగా తనపైన వేసికొన్నాడు.'' అక్రూరుని కంటినుండి వడ్డ రెండు అశ్రు బిందువులు........యమునలో ఉన్నట్లుండి వరద వచ్చింది. నడుముదాకా ఉన్న నీటిమట్టం గుండెలదాకా వచ్చింది... అప్పటివరకు చల్లగా ఉన్న నీటి కెరటాలలో ఉష్ణోగ్రత పెరిగింది... తటిపై ఉన్న పశువులు అంబారవం చేసాయి.

"ఇటువైపు చూడు ఉద్ధవా... ప్రవాహానికి అటువైపు ఉన్న వలయం వైపు స్థిరంగా చూడు..." అక్రూరుడు అన్నాడు. ఉద్ధవుడి ధ్యాసని ఆకర్షిస్తూ...

"ఆ లోతైన నీటిపై వీస్తున్న గాలి కాళిందిపైన ఒక ఆకృతిని పొందుతోంది... నీకు ఆ ఆకృతి కనిపిస్తోందా ఉద్ధవా?"

ఉద్ధవుడు స్థిర దృష్టితో చూస్తున్నాడు. అక్రూరుడు ఛాతిలోతుగ ఉన్న నీటిలో ఉన్నాడు. ఆయన పొడుగైన శిరోజాలనుండి నీటిబొట్లు పడుతున్నాయి. అక్రూరుడు చూపించిన ఆ వలయం...ఉద్ధవుడు స్తబ్ధుడైనాడు....ఆయన చూసినది ఏమిటి? "...అదే ....అదే విశ్వదేవుని నివాసం ఉద్ధవా..." అన్నాడు అక్రూరుడు. లోతైన నీటి ప్రవాహం నుండి ఒక అద్భుతమైన ఆకృతి వెలువడుతోంది.

"యోగసమాధి పొందే సౌభాగ్యం నాకు లభించలేదు ఉద్ధవా! చూసావా! విశ్వదేవుడు స్వయంగా కాళింది ప్రవాహంలో ప్రకటితమైనాడు.... ఇక నాకు వీడ్కోలు ఇవ్వు.... కృష్ణుడే చెప్పాడు నాకు "అక్రూరా! మీరు విశ్వదేవునిలో వాసం చేస్తారు!... ఆ ఘడియ రానే వచ్చింది! కాళింది జలాల్లో జల సమాధిపొందే సౌభాగ్యం..."

ఉద్ధవుడు వణికిపోయాడు... ఆయన రోమాలు తీవ్రంగా నిక్కపొడుచుకున్నాయి.... శరీరం అంతా చల్లబడింది.... హిమాలయ యాత్రా క్రమంలో అలకనందలోని మంచుతో గడ్డకట్టిన నీటిలో మంచుని ప్రాతఃకాల సంధ్య చేస్తున్న సమయంలో కూడా ఇంత చల్లదనం అనుభవించలేదు! కాళిందిలో ఉద్ధవుడు ఎన్నోసార్లు స్నానం చేశాడు! కాళిందిలోని ప్రతినీటి బిందువు అతనికి చిరపరిచితమే...

-సశేషం

## శ్రద్ధాంజలి

ఆశ్రమ స్థిరనివాసులు, పరమభక్తులు, నిరంతర ఆశ్రమసేవా తత్పరులైన శ్రీ, గాదె కోదండరామయ్యగారు **2-12-2010** గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు **82**సంవత్సరాలు. వీరికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు కలరు. వీరికి సద్గురుదేవులు ఆత్మశాంతిని ప్రసాదించెదరు గాక!

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL